ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
5
శ్రీ పొట్టిశ్రీరాములు
నెల్లూరు
జిల్లా వార్తలు
మంగళవారం, 13 ఆగస్టు 2024

16 నుంచి రెవెన్యూ సదస్సులు



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ ఆనంద్

నెల్లూరు(హరనాథపురం); ఆగస్టు 12 : రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 15 నుంచి రెవెన్యూ సదస్సులను లాంఛనంగా ప్రారంభించనున్నదని, జిల్లాలో మాత్రం ఈనెల 16 నుంచి ప్రారంభిస్తామని కలెక్టర్ ఓ ఆనంద్ చెప్పారు. సోమవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆయన సబ్‌కలెక్టర్లు, ఆర్డీవోలు, తహసీల్దార్లు, ఎంపీడీవోలతో మాట్లాడారు. సెప్టెంబరు 30 వరకు ఈ సదస్సులు జరుగుతాయని చెప్పారు. రెవెన్యూలో ఇంటిగ్రేటెడ్ సర్టిఫికెట్ల మంజూరు చేస్తామన్నారు. మ్యూటేషన్ ట్రాన్సాక్షన్లపై తహసీల్దార్లు ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు. ఎలాంటి కారణాలు లేకుండా దరఖాస్తులను తిరస్కరిం చవద్దని తెలిపారు. గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చూడాలని సూచించా రు. మంచి నీటి ట్యాంకులను శుభ్రపరచాలన్నారు. చెత్త సేకరణలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసు కుంటామని హెచ్చరించారు. గ్రామాల్లో కౌలు రైతులకు సీసీఆర్‌సీ కార్డు లు వెంటనే అందించాలన్నారు. ఎస్టీలకు బర్త్ సర్టిఫికెట్లు మంజూరు చేయాలన్నారు. ఇళ్ల నిర్మాణాల కు బిల్లులను ప్రభుత్వం చెల్లింపులు చేస్తున్నదని చెప్పారు. కూలీలకు ఉపాధిహామీ పనిదినాలు పెంచాలన్నారు. పాఠశాలల్లో ఆర్వో ప్లాంట్లకు మరమ్మతులు చేయించాలని తెలిపారు. ఈ సమావేశంలో జేసీ సూర్యతేజ, డీఆర్వో లవన్న తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శి సస్పెన్షన్

పొదలకూరు, ఆగస్టు 12 : పంచాయతీ నిధులు స్వాహా చేసిన పొదలకూరు మండలం ప్రభగిరిపట్నం పంచాయతీ సెక్రటరీ పుష్పలతను జిల్లా అధికారులు సస్పెం డ్ చేశారు. సుమారు రూ.35లక్షలను ఆమె గోల్‌మాల్ చేసినట్లు ఇన్‌చార్జి ఎంపీడీవో సుబ్రహ్మణ్యం సోమవారం తెలిపారు. ఈ విషయమై గ్రామస్థులు లోకాయుక్తను ఆశ్రయించారని, లోకాయుక్త ఆదేశాలతో జిల్లా ఉన్నతాధికారులు విచారణ జరిపారని వివరించారు. నిధుల స్వాహా చేసింది నిజమేనని తేలడంతో పంచాయతీ సెక్రటరీని సస్పెం డ్ చేసినట్లు ఆయన తెలిపారు.

ప్రతి కౌలు రైతుకు సీసీఆర్‌సీ

- నూరుశాతం పంపిణీకి ప్రభుత్వం చర్యలు
- ఇప్పటికే 65శాతానికి పైగా మంజూరు
- రైతన్నలను ఆదుకునే దిశగా అడుగులు

నెల్లూరు(వ్యవసాయం), ఆగస్టు 12 : కౌలు రైతులకు అండగా నిలవాలన్న లక్ష్యంతో కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నది. ప్రభుత్వ ఆర్థిక సహాయం, సున్నా వడ్డీ పంట రుణాలు, రాయితీ, పంటల బీమా వంటి పథకాలు అందించాలనే లక్ష్యంతో ప్రతి కౌలు రైతుకు పంట సాగుదారుపత్రం (సీసీఆర్‌సీ) ఇవ్వాలని నిర్ణయించి ఆదేశాలు జారీ చేసింది. ఇందుకు అవసరమైన ప్రణాళికలను రూపొందించింది.

● 50 వేలమంది కౌలు రైతులు

జిల్లాలో సుమారుగా 50 వేలమంది వరకు కౌలు రైతులు ఉన్నారు. వీరంతా వ్యవసాయ, ఉద్యాన, వాణిజ్య పంటలను సాగుచేసుకుంటున్నారు. అయితే గత ప్రభుత్వ హయాంలో ఎంతోమంది అర్హులైన రైతులకు సీసీఆర్‌సీ అందలేదు. కారణం ఈ-పంటలో నమోదు కాకపోవడమే. దీంతో ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు, పంట దిగుబడులు తగ్గినప్పుడు వీరంతా తీవ్రంగా నష్టపోతున్నారు. అప్పులు చేసి పంటలు సాగుచేసిన వారంతా అప్పులు తీర్చలేక నానాఇబ్బందులు పడుతున్నారు. ఈనేపథ్యంలో కూటమి ప్రభుత్వం వారికి భరోసా ఇచ్చేలా చర్యలు తీసుకుంటోంది. ప్రతిఒక్కరికీ సీసీఆర్‌సీ అందించాలని ఆదేశాలు జారీ చేసింది.

● 11నెలల కాలపరిమితి..

భూయజమానికి, పంటల సాగుదారుడికి 11నెలల పాటు ఒప్పందం కుదిర్చేదే సీసీఆర్‌సీ. దీనికోసం కౌలుకు పంటలు సాగుచేసే రైతులు ఆయా గ్రామ రెవెన్యూ అధికారి(వీఆర్వో) కి దరఖాస్తు ఇవ్వాలి. అనంతరం మూడు రోజుల్లోనే సీసీఆర్‌సీ అందచేస్తారు. అయితే కొన్ని సందర్భాల్లో భూయజమాని ఇందుకు ఒప్పుకోకపోతే రైతు సేవా కేంద్రాల ద్వారా ఈ-పంటలో నమోదు చేసుకునే అవకాశం ఉంది. తద్వారా ప్రభుత్వం అందించే అన్నీ ప్రయోజనాలు అందుతాయి. దేవదాయశాఖ భూములు సాగు చేసుకనే వారు కూడా ఇందుకు అర్హులే..

● నూరుశాతం పంపిణీ దిశగా చర్యలు

జిల్లాలో దాదాపు ఐదు లక్షల ఎకరాల్లో వరితోపాటు వివిధ పంటలు సాగవుతున్నాయి. సుమారుగా 3,77,000 మంది వ్యవసాయ భూమి ఉన్న రైతులు ఉన్నారు. భూమిలేని రైతులు 50వేల మంది వరకు ఉన్నట్లు అంచనా. ఈనేపథ్యంలో వ్యవసాయ, రెవెన్యూ అధికారులు ఇప్పటికే గ్రామాల్లో పర్యటిస్తూ కౌలుదారులను గుర్తించి వారికి సీసీఆర్‌సీ మంజూరు చేస్తున్నారు. ఎగువ నుంచి వరద నీరు సోమశిలకు చేరుకుంటోంది. దీంతో రానున్న రబీ సీజన్‌లో పంటలసాగు అధికారుల అంచనాలకు మించి జరిగే అవకాశం ఉంది. దీంతో ఇప్పటి నుంచే యజమానులు, కౌలుదారులతో ఒప్పందాలు చేయించే కార్యక్రమాలు వేగంగా సాగుతున్నాయి. అధికారిక లెక్కల ప్రకారం జిల్లాలో



38,330 మంది కౌలు రైతులకు సీసీఆర్‌సీ ఇవ్వాలన్నది ప్రభుత్వ లక్ష్యం. కాగా ఇప్పటి వరకు 24,817 కార్డులు మంజూరు చేశారు. దాదాపు 65శాతానికిపైగా లక్ష్యాన్ని చేరుకున్నారు. మిగిలిన 13,513 కార్డులను రబీ సీజన్ ప్రారంభానికి ముందే అందించే దిశగా అధికార యంత్రాంగం పనిచేస్తోంది.

రైతు సేవా కేంద్రాలను సంప్రదించాలి



సీసీఆర్‌సీ కోసం కౌలు రైతులు ఆయా గ్రామాల రెవెన్యూ, వ్యవసాయ అధికారులను సంప్రదించాలి. జిల్లాలో ఇప్పటికే దాదాపు 65శాతం సీసీఆర్‌సీలు మంజూరు చేశాం. నెలాఖరులోగా నూరుశాతం అందించేందుకు అన్నీ చర్యలు తీసుకుంటున్నాం. ఏవైనా అనుమానాలుంటే రైతు సేవా కేంద్రాల్లోని వ్యవసాయ అధికారులను సంప్రదించాలి.

- సత్యవాణి,
జిల్లా వ్యవసాయాధికారి

ఫలితమివ్వని ఫైబర్ నెట్

ప్రజల కలల ప్రాజెక్టుకు బ్రేకులు

వైసీపీ పాలనలో వ్యవస్థ నిర్వీర్యం

మారుతున్న కాలానికి అనుగుణంగా ప్రజల జీవన ప్రమాణాల్లోనూ మార్పులు తీసుకురావాలని గత టీడీపీ ప్రభుత్వం భావించింది. అందుకు అనుగుణంగా 'ఏపీ ఫైబర్ నెట్' ప్రాజెక్టును ప్రారంభించింది. అతి తక్కువ ధరకే ఇంటర్నెట్, కేబుల్ కనెక్షన్ ఇచ్చేలా ఈ ప్రాజెక్టును రూపొందించింది. ప్రజల కలల ప్రాజెక్టుగా మారిన ఏపీ ఫైబర్ నెట్‌ను వైసీపీ ప్రభుత్వం నిర్వీర్యం చేసింది. జిల్లాలో ఈ ప్రాజెక్టును ప్రైవేటు వ్యక్తుల చేతుల్లో పెట్టడంతో వారి అవినీతి, నిర్లక్ష్యం కారణంగా ప్రాభవం కోల్పోయింది.

- భారీగా తగ్గిన కనెక్షన్లు
- 2019లో 86 వేలు ఉండగా, నేడు 26 వేలు
- సకాలంలో సేవలు అందించకపోవడమే కారణం
- స్కూళ్లకు కూడా ఇవ్వని కనెక్షన్లు
- ప్రైవేటు వ్యక్తుల చేతుల్లో కునారిల్లిన సంస్థ



నెల్లూరు, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం ఇంటర్నెట్, కేబుల్ కనెక్షన్ కలిపి తీసుకోవాలంటే ఏ ప్రైవేటు ఆపరేటర్ అయినా కనీసం రూ.500కు తక్కువ వసూలు చేయడం లేదు. జిల్లాలో పేరుమోసిన ఆపరేటర్లు ఒక్క కేబుల్ కనెక్షన్‌కే నెలకు రూ.330 వసూలు చేస్తున్నారు. ఇందుకు అదనంగా ఇంటర్నెట్ కనెక్షన్ అంటే మరో రూ.300పైనే చెల్లించాల్సి ఉంది. అయితే ఈ రెండింటినీ ప్రస్తుతం ఏపీ ఫైబర్ నెట్ కింద రూ.350 కే అందిస్తున్నారు. ఇంత తక్కువ ధర అయినా ప్రజలు ఎందుకు ప్రభుత్వ సర్వీసును తీసుకోవడం లేదంటే, అందుకు అనేక ప్రశ్నలు తెరముందుకు వస్తున్నాయి. 2014-19 మధ్య టీడీపీ ప్రభుత్వంలో ప్రారంభమైన ఏపీ ఫైబర్ నెట్ సేవలు జిల్లాలో అనతికాలంలోనే విస్తరించాయి. 2019 ఎన్నికల సమయం నాటికి ఉమ్మడి జిల్లాలో ఈ కనెక్షన్లు 86 వేలకు పెరిగాయి. అయితే ఆ తర్వాత వైసీపీ ప్రభుత్వంలో ఏపీ ఫైబర్ నెట్‌ను నిర్లక్ష్యం చేసింది. దీన్ని దోపిడీకి కేరాఫ్‌గా మార్చింది. దీంతో జిల్లాలో క్రమేణా కనెక్షన్ల సంఖ్య తగ్గుతూ వచ్చింది. ప్రస్తుత విభజిత జిల్లాలో 16 వేల కనెక్షన్లు మాత్రమే ఉన్నాయి. ఉమ్మడి జిల్లాను కలుపుకున్నప్పటికీ 26 వేలకు మించి లేవని లెక్కలు చెబుతున్నాయి. గత ఐదేళ్లలో కనెక్షన్లు పెరగాల్సింది పోయి భారీగా తగ్గిపోయాయి.

అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల చేతుల్లో నిర్వీర్యం

ఏపీ ఫైబర్‌నెట్ ప్రాజెక్టులో భారీగా అక్రమాలు జరిగాయని ఎన్డీయే ప్రభుత్వం గుర్తించింది. ప్రస్తుతం అమరావతిలోని ప్రధాన కార్యాలయంలో విచారణ కూడా జరుగుతోంది. అదే సమయంలో జిల్లాలోనూ అక్రమాలు జరిగినట్లు ప్రభుత్వం దృష్టికి వెళ్లింది. ఇంత పెద్ద వ్యవస్థను జిల్లాలో అవుట్‌సోర్సింగ్ సిబ్బంది చేతుల్లో పెట్టారు. ఒక్కరంటే ఒక్కరు కూడా రెగ్యులర్ ఉద్యోగి లేరంటే అతిశయోక్తి కాదు. వీరి నియామకం కూడా దొడ్డిదారిన జరిగినట్లు ఆరోపణలున్నాయి. ప్రస్తుతం జిల్లా వ్యవహారాలను చూస్తున్న ఓ ఉద్యోగిపై అవినీతి ఆరోపణలు రావడంతో ఎన్నికలకు ముందు ఉద్యోగంలో నుంచి తొలగించారు. అయితే ఎన్నికల సమయంలో మళ్లీ అదే ఉద్యోగిని తీసుకొచ్చి మళ్లీ అదే స్థానంలో కూర్చోబెట్టడమే ఇందుకు నిదర్శనమని ఆ ప్రాజెక్టు వర్గాలు చెప్పుకుంటున్నాయి. ఇలా అవుట్ సోర్సింగ్ ఉద్యోగులంతా సొంత అవసరాలు చూసుకున్నారు తప్ప సక్రమంగా విధులు నిర్వహించలేదని, అదే జిల్లాలో ఏపీ ఫైబర్ నెట్ కునారిల్లిపోవడానికి ప్రధాన కారణమన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. సర్వీసులో ఎక్కడైనా సమస్య తలెత్తితే ఒక పట్టాన ఆ సమస్యను పరిష్కరించరని,దీంతో కస్టమర్లు విసుగు చెంది ఒక్కొక్కరుగా దూరమవుతున్నారని తెలుస్తోంది.

పాఠశాలలకు కనెక్షన్లు ఇచ్చాం

ఏపీ ఫైబర్ నెట్ సేవల్లో ఎటువంటి ఇబ్బందులు లేవు. ఎక్కడ ప్రాబ్లమ్ వచ్చినా వెంటనే పరిష్కరిస్తున్నాం. కనెక్షన్లు 2019తో పోలిస్తే తగ్గాయి. పాఠశాలన్నింటికీ ఇంటర్నెట్ కనెక్షన్లు ఇచ్చాం. ఇంకా ఎక్కడైనా ఇవ్వాల్సి ఉంటే పరిశీలించి ఇస్తాం.

- అశోక్ కుమార్, ఏపీ ఫైబర్ నెట్ జిల్లా నెట్‌వర్క్ మేనేజర్

కాగితాల్లోనే వాహనాలు

జిల్లాలో ఎక్కడ సమస్య వచ్చినా పరిష్కరించడానికి ఎనిమిది టెక్నికల్ వాహనాలు ఉన్నాయి. అయితే ఇవన్నీ పేపర్ల మీదనే ఉంటాయని, వాస్తవానికి ఒకటి, రెండు వాహనాలతోనే నెట్టుకొస్తున్నారన్న ఆరోపణలున్నాయి. కానీ నెల నెలా బిల్లులు మాత్రం అన్ని వాహనాలకు పెడుతూ రూ.లక్షలు దోచుకుతింటున్నారన్న ఫిర్యాదులు ప్రభుత్వానికి అందాయి. అదే సమయంలో కనెక్షన్లు కూడా తక్కువగా చూపించి ఆ బిల్లులను తినేసినట్లు అధికారులు చెప్పడంతో ఇటీవల ఓ సమావేశంలో స్వయంగా సీఎం చంద్రబాబు ఆశ్చర్యాన్ని వ్యక్తం చేశారు. కనెక్షన్లు పెంచకుండా తగ్గించుకుంటూ వెళ్లడంలో మరో మతలబు కూడా ఉందని ప్రచారం జరుగుతోంది. ఈ ప్రాజెక్టులో పనిచేస్తున్న కొందరు ఉద్యోగులు ప్రైవేటు ఆపరేటర్లతో కుమ్మక్కై ఉద్దేశపూర్వకంగా కస్టమర్ దూరమయ్యేలా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు కూడా ఉన్నాయి.

విద్యార్థులతోనూ ఆటలు



పాఠశాలల్లో విద్యార్థులకు డిజిటల్ బోధన ద్వారా పాఠాలు చెప్పాలని ప్రభుత్వం భావించింది. ఆ క్రమంలో ప్రతీ పాఠశాలలో టీవీను ఏర్పాటు చేసి దానికి ఏపీ ఫైబర్ నెట్ ద్వారా ఇంటర్నెట్ కనెక్షన్ ఇవ్వాల్సి ఉంది. చాలా పాఠశాలలకు రెండేళ్ల క్రితమే టీవీలను అందించారు. కొన్నింటికి ఏడాది క్రితం టీవీలు బిగించారు. కానీ ఇప్పటికీ ఇంటర్నెట్ సేవలను మాత్రం అందించలేదు. ఈ కనెక్షన్లు ఇచ్చే ప్రక్రియలో కూడా అక్రమాలు జరిగినట్లు తెలుస్తోంది. పాఠశాలలకు కనెక్షన్లు ఇవ్వకుండానే ఇచ్చినట్లు కొన్ని చోట్ల రికార్డు చేసి బిల్లులు తినేసినట్లు ఆరోపణలున్నాయి. ప్రభుత్వం నుంచి వచ్చిన ఇంటర్నెట్ సామగ్రిని కూడా పక్కదారి పట్టించాలని కుట్రలు చేసినట్లు తెలుస్తోంది. కానీ వైసీపీ ప్రభుత్వం మారి ఎన్డీయే ప్రభుత్వం రావడంతో ఆ కుట్రకు బ్రేక్ పడినట్లు చెప్పుకుంటున్నారు. గడిచిన పది రోజులుగా ఇంటర్నెట్ కనెక్షన్లకు సంబంధించిన సామగ్రి ఎంఈవో కార్యాలయాలు, పాఠశాలలకు చేరుతోంది. అయితే ఏపీ ఫైబర్ నెట్ ఉద్యోగులు మాత్రం పాఠశాలలకు కనెక్షన్లు ఇచ్చినట్లు చెబుతుండడం గమనార్హం.

అపరాధ రుసుము రద్దయినా..

- పొగాకు ధర ధమాల్
- సగటున క్వింటంకు రూ. 4వేలు పతనం
- అనధికార కొనుగోళ్లలో వ్యాపారుల చేతివాటం
- నామమాత్రపు బేళ్లకే అధిక ధర



కందుకూరు, ఆగస్టు 12: ప్రజాప్రతినిధులు, బోర్డు ఉన్నతాధికారులు విశ్వప్రయత్నం చేసి, రైతులు అదనంగా పండించిన పొగాకుకు అపరాధ రుసుము రద్దు చేయించినా ప్రయోజనం లేకుండా పోయింది. అపరాధ రుసుము రద్దుతో తమకు మేలుజరుగుతుందన్న రైతుల ఆనందం ఆవిరైంది. అనధికార పొగాకు కొనుగోళ్లు ప్రారంభించినప్పటి నుంచి వ్యాపారులు మాయాజాలంతో ధరలు దిగజార్చారు. దీంతో అపరాధ రుసుము రద్దు వల్ల చేకూరే ప్రయోజనం రైతులకా... లేక వ్యాపారులకా...? అన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

కేంద్ర వాణిజ్యపన్నుల శాఖామంత్రి పీయూష్ గోయల్‌పై మన రాష్ట్ర ఎంపీలు, పొగాకుబోర్డు ఛైర్మన్, వైస్ ఛైర్మన్‌లు ఒత్తిడితెచ్చి అనధికార పొగాకుకు సాధారణంగా వసూలు చేసే అపరాధ రుసుమును రద్దుచేయించారు. అపరాధ రుసుము ప్రతిఏటా రద్దుచేస్తూపోతే పొగాకుబోర్డు నిర్వీర్యం అయ్యే ప్రమాదం ఉందన్న ఆలోచనతో కేంద్రప్రభుత్వం కొంత సంశయించినా, రాష్ట్రప్రభుత్వం నుంచి వచ్చిన ఒత్తిడితో చివరికి రైతులకు అనుకూలంగా నిర్ణయం తీసుకుంది. ఈ క్రమంలో సుమారు 40 రోజులపాటు వేలం కేంద్రాల్లో కొనుగోళ్లు నిలిచిపోయాయి. ఇటీవలే అనధికార పొగాకు కొనుగోళ్లు ప్రారంభమయ్యాయి. మరుసటి రోజు నుంచే మార్కెట్లో ధరల క్షీణత ప్రారంభమైంది. కందుకూరు-2 వేలం కేంద్రాలతోపాటు అనధికార పొగాకు కొనుగోళ్లు జరుగుతున్న అన్ని వేలం కేంద్రాల్లోనూ ఇదే పరిస్థితిజ అపరాధ రుసుము ఐదుశాతం అనుకున్నా క్వింటాకు రూ.2వేల వరకు రైతులకు లబ్ధి చేకూరుతుందని ఆశించారు. అయితే అనూహ్యంగా వ్యాపారులు క్వింటాకు రూ. 4వేలు వరకు ధరలను దిగజార్చారు. పొగాకు వ్యాపారంలో గుత్తాధిపత్యం వహిస్తున్న ప్రధాన కంపెనీలు సిండికేట్‌గా మారి ధరల్లో మాయాజాలం ప్రదర్శిస్తున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

అధిక ధరల్లో కోత

అధికారిక పొగాకు అమ్మకాల చివరి రోజుల్లో వ్యాపారులు పోటీపడి కొనుగోళ్లు చేయటం ద్వారా రోజుకోరీతిలో ధర పెంచారు. నాణ్యమైన పొగాకుకు క్వింటాకు రూ. 36,700 వరకు చెల్లించేందుకు కూడా వ్యాపారులు సిద్ధపడ్డారు. అయితే ప్రస్తుతం నాణ్యమైన పొగాకుకు కూడా క్వింటాకు రూ. 35,800కు మించి చెల్లించేందుకు వ్యాపారులు ముందుకు రావటం లేదు. ఆ ధరను కూడా అతితక్కువ బేళ్లకు మాత్రమే ఇస్తూ మీడియం గ్రేడ్‌లు, లోగ్రేడ్‌లకు ధరలను మరింత దిగజార్చారు.

సోమశిల క్రస్ట్‌గేట్లు భద్రమేనా?

- తుంగభద్ర ఘటనతో అనుమానాలు
- ఎగువ నుంచి కొనసాగుతున్న వరద
- 11,12 క్రస్ట్‌గేట్లపై సందిగ్ధం
- ప్రాజెక్టును నిర్లక్ష్యం చేసిన వైసీపీ ప్రభుత్వం

జిల్లా వరప్రదాయిని అయిన సోమశిల జలాశయం క్రస్ట్‌గేట్లు భద్రమేనా? అని జలవనరులశాఖ నిపుణులు సైతం నేడు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. కర్ణాటకలోని తుంగభద్ర ప్రాజెక్టు 19వ నెంబరు క్రస్ట్‌గేట్ శనివారం రాత్రి వరద తాకిడికి కొట్టుకుపోయిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో సోమశిల క్రస్ట్‌గేట్ల నిర్వహణపై ప్రజల్లో భయాందోళనలు నెలకొన్నాయి. గత కొన్ని రోజులుగా శ్రీశైలం నుంచి కృష్ణా జలాల రాక కొనసాగుతోంది. రోజురోజుకు ప్రవాహ ఉధృతి కనిపిస్తోంది. ప్రస్తుతం 15 వేల క్యూసెక్కుల నీరు వస్తోంది. దీనికితోడు ఎగువన వర్షాలు కురిస్తే ప్రవాహం మరింత పెరిగే సూచనలు ఉన్నాయి.



సోమశిల జలాశయం క్రస్ట్‌గేటుకు ఉన్న పాతరోప్

గేట్ల నుంచి కొనసాగుతున్న లీకేజీ (ఫైల్)

అనంతసాగరం, ఆగస్టు 12: సోమశిల ప్రాజెక్టు నిర్వహణను గత వైసీపీ పాలనలో పట్టించుకున్న దాఖలాలు లేవు. జలాశయం గేట్లకు గ్రీజు పూసేందుకు కూడా నిధులు విడుదల చేయని దుస్థితి. ప్రాజెక్టుకు 12 క్రస్ట్‌గేట్లు ఉండగా, జలాశయ నిర్మాణ సమయంలో ఏర్పాటు చేసిన రోప్‌లతో నేటికీ కాలం గడుపుతున్నారు. వాటిని మార్చి ఆధునికీకరణ పనులు చేయాలని గతంలో నిపుణుల కమిటీ సూచించినా పట్టించుకున్న దాఖలాలు లేవు. రోప్‌లను మెయింటెనెన్స్ చేయక కొన్ని గేట్లు మొరాయిస్తున్నాయి. ప్రస్తుతం 11, 12 నెంబర్ల క్రస్ట్‌గేట్ల తీరు ప్రశ్నార్థకంగా ఉంది. రోప్‌లు తుప్పు పట్టి ఉన్నాయి. దీంతో వీటి నిర్వహణపై ఇంజనీర్లు ఆందోళన చెందుతున్నారు.

● ప్రభుత్వం చొరవ

సాగునీటి రంగంపై కూటమి ప్రభుత్వం ప్రత్యేక చొరవ చూపుతోంది. ఇందులో భాగంగా గతనెల 14న మంత్రులు పొంగూరు నారాయణ, ఆనం రామనారాయణరెడ్డి, ఇరిగేషన్ మంత్రి నిమ్మల రామానాయుడు సోమశిలను సందర్శించారు. క్రస్ట్‌గేట్ల వ్యవస్థను చూసి నివ్వెరపోయారు. తుప్పుపట్టిన రోప్‌ల ఫొటోలను ప్రదర్శించి, ప్రాజెక్టు లోపాలను బయటపెట్టి వైసీపీ పాలనలో జరిగిన నిర్లక్ష్యాన్ని ఎండగట్టారు. అనంతరం ప్రాజెక్టు అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేసి గేట్లను పటిష్ట పరిచేలా ఆదేశాలు ఇచ్చారు. దీంతో అధికారులు ఇటీవల గేట్ల మెయింటెనెన్స్ పనులను చేశారు. గేట్లన్నీ ఎత్తి ట్రయల్ రన్ నిర్వహించారు. రోప్‌ల వ్యవస్థను పటిష్ట పరిచేలా చేపట్టాల్సిన పనుల కోసం రూ 2.5 కోట్లకు ప్రతిపాదనలు కూడా పంపారు. కాగా, జలాశయం క్రస్ట్‌గేట్ల వ్యవస్థపై పట్టు కలిగిన ప్రత్యేక సిబ్బంది కూడా ఇక్కడ ఎంతో అవసరం. వీరి నియామకంపై ప్రభుత్వం శ్రద్ధ చూపాల్సి ఉంది.

మరణించినా బతికున్నట్లే !

- అవయవ దానం, మరికొందరికి ప్రాణదానం
- కిడ్నీ, నేత్రదానాల్లో జిల్లాకు ప్రాధాన్యత
- గత పదేళ్లలో 60 మంది అవయవదాతలు
- తాజాగా ప్రభుత్వం ప్రోత్సాహం
- నేడు జాతీయ అవయవదాన దినోత్సవం

నెల్లూరు(వైద్యం) ఆగస్టు 12: ప్రతిఒక్కరూ తమ మరణానంతరం అవయవదానం చేయటం వల్ల మరికొందరికి ఆ అవయవాలు ఎంతో ఉపయోగపడతాయి. బ్రెయిన్‌డెడ్ అయిన వ్యక్తి ఇచ్చే అవయవాల వల్ల కొంతమంది ప్రాణాలు నిలుపవచ్చు. మరణించిన ప్రతి మనిషి మట్టిలో కలవాల్సిందే. లేదంటే బూడిద కావాల్సి ఉంటుంది. ఈ పరిస్థితిలో అవయవదానం ద్వారా బతికే ఉండవచ్చన్న సత్యాన్ని ప్రతిఒక్కరూ తెలుసుకోవాలి. సామాజిక కట్టుబాట్లు, మూఢనమ్మకాల కారణంగా ఎంతో మంది సేవాదృక్పథం ఉన్నవారు సైతం తమ మరణానంతరం అవయవదానం చేసేందుకు పెద్దగా ఆసక్తి చూపటం లేదు. దేశ వ్యాప్తంగా ఏటా అవసరమైన అవయవాలు అందుబాటులోలేక ఐదు లక్షల మంది చనిపోతున్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. జిల్లాలోనూ మూడువేల మందికిపైగా మరణిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా బ్రెయిన్ డెత్‌కు గురయిన వారిలో గత పదేళ్లలో 60 మంది మాత్రమే ముందుకు వచ్చి అవయవదానం చేశారు. ఆయాదాతల సాయం కారణంగా 90మంది వరకు మరణాన్ని జయించారు. గుండె, కిడ్నీ, లివర్, ఊపిరి తిత్తులు, నేత్రాలు వంటి ఎన్నో అవయవాలు సేకరించి జిల్లా లో కొన్ని వినియోగించగా, కొన్నింటిని రాష్ట్ర వ్యాప్తంగా పంపి ణీ చేశారు. ఈ నేపథ్యంలో ప్రపంచ ఆరోగ్య సంస్థ అవయవదానంపై చైతన్యం తీసుకొవచ్చేలా ప్రతిఏటా ఆగస్టు 13న అవయవదాన దినోత్సవాన్ని జరుపుకోవాలని తీర్మానించింది.

● జిల్లాలో వ్యాధిగ్రస్థులెందరో...?

జిల్లావ్యాప్తంగా ఎంతోమంది వ్యాధిగ్రస్థులు అవయవ దాతల కోసం ఎదురు చూస్తున్నారు. కిడ్నీ, గుండె, లివర్, ఊపిరితిత్తుల వ్యాధిగ్రస్థులే వేల సంఖ్యలో ఉన్నారు. వీరిలో ఐదువేలమందికి ఆయా అవయవాలు అవసరం ఉంటుందని వైద్యనిపుణులు చెబు తున్నారు. కిడ్నీ వ్యాధి గ్రస్థులు జిల్లాలో 30 వేలమంది ఉండగా, వీరిలో రెండు కిడ్నీలు చెడిపోయి ఏటా 2,500 మంది రోగులు మృత్యువాత పడుతున్నారు. వీరికి కుటుంబ సభ్యులు ఓ కిడ్నీ దానం చేసినా బతికే అవకాశం ఉంది. గుండె మార్పిడికి ఏటా వేయిమందికిపైగా అవసరమవుతుంది. ఇది చాలా ఖర్చుతో కూడుకున్నది కావటంతో ఎందరో పేదలు మృత్యువాత పడుతున్నారు. కొందరు ఉన్నత వర్గాలు మాత్రమే దాతల సహకారంతో గుండె మార్పిడి శస్త్రచికిత్సలు చేయించుకుంటున్నారు. ఏటా లివర్ పూర్తిగా దెబ్బతిని లివర్ మార్పిడి అవసరమైన 1500 మంది రోగులు మార్పిడి చేయించుకోలేక మరణిస్తున్నారు. కుటుంబ సభ్యుల్లో ఒకరు సగం లివర్ దానం చేస్తే బాధితులు బతికే అవకాశం ఉంది.



ఇప్పటి వరకు అవదానం చేసిన దాతలు

సంవత్సరం	గుండె	కిడ్నీ	లివర్	ఊపిరితిత్తులు	కళ్లు
2022	3	62	6	9	392
2023	5	56	5	10	233
2024	1	22	4	12	184

● అవయవ మార్పిడి శస్త్రచికిత్సలు

జిల్లాలోని కార్పొరేట్ ఆసుపత్రులు అవయవ మార్పిడి శస్త్రచికిత్సలు అందిస్తున్నాయి. నారాయణ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి, అపోలో, కిమ్స్ ఆసుపత్రుల్లో వందకు పైగా కిడ్నీల మార్పిడి జరిగింది. లివర్ మార్పిడి శస్త్రచికిత్స జిల్లాలో అందుబాటులో లేదు. చెన్నై, హైదరాబాద్‌ల్లో మాత్రమే అందుబాటులో ఉంది. ఇప్పటి వరకు జిల్లాకు చెందిన 20 మంది వరకు ఆయా ఆసుపత్రిల్లో లివర్ మార్పిడి శస్త్రచికిత్సలు జరిగాయి. గుండెమార్పిడి శస్త్ర చికిత్స జిల్లాలో ఇప్పటివరకు జరగలేదు. బ్రెయిన్‌డెత్, వెంటిలేటర్‌పై ఉన్న వారి అనుమతితో గుండె మార్పిడి విధానం చెన్నై, ముంబాయి, హైదరాబాద్, ఢిల్లీలోని ఎయిమ్స్‌లో మాత్రమే చేస్తున్నారు. నేత్ర మార్పిడి నెల్లూరులోని మోడరన్ ఐ కంటి వైద్యశాలలో జరుగుతుంది.

● దాతలను ప్రోత్సహించాలి

విజయవాడ కేంద్రంగా ఉన్న జీవన్‌దాన్ సంస్థ అవయవ మార్పిడికి అనుమతులు ఇవ్వాలి. ప్రభుత్వం గుర్తించిన ఈ సంస్థ అనుమతి ఇస్తేనే ఎవరికైనా ఆయా ఆసుపత్రు ల్లో శస్త్ర చికిత్సల ద్వారా అవయవాలను అమర్చుతారు. ఈ సంస్థలో ఇప్పటికే జిల్లాకు చెందిన వందలమంది రోగులు తమ పేర్లను నమోదు చేసుకున్నారు. ఇందులో కిడ్నీ వ్యాధుల బాధితులే ఎక్కువ. ఎంతో చైతన్యం ఉన్నా జిల్లాలో అవయవదానంపై దాతలను ప్రోత్సహించాల్సి ఉంది.

● ప్రభుత్వ ప్రోత్సాహం

ఇకపోతే రాష్ట్ర ప్రభుత్వం తాజాగా అవయవదానంపై ప్రోత్సాహకాలు ప్రకటించింది. అవయవ దానం చేసే వారి అంత్యక్రియల్లో తప్పనిసరిగా మంత్రులు, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజా ప్రతినిధులు పాల్గొనాలని పిలుపు నిచ్చింది. బ్రెయిడ్ డెత్ అయిన కేసులలోనే కాకుండా ఒక కిడ్నీ దానం చేసిన కుటుంబ సభ్యులను ప్రోత్సహించాలన్న ఉద్దేశంతో ఈ విధమైన ప్రకటనను చేసినట్లు ప్రభుత్వం పేర్కొంది. దీంతో అవయవదాతలు ముందుకు వచ్చే అవకాశం ఉంది.


కిమ్స్ ఆసుపత్రి నుంచి గుండె, లివర్‌ను తీసుకువెళుతున్న వైద్యులు(ఫైల్)

అవగాహన కల్పిస్తున్నాం..



అవయవదానం పట్ల నారాయణ ఆసుపత్రిలో రోగులకు, సహాయకులకు అవగాహన కల్పిస్తున్నాం ఇప్పటికే 110 మందికిపైగా కిడ్నీ మార్పిడి చేశాం. అలాగే బ్రెయిన్ డెడ్ అయిన వారి నుంచి కూడా గుండె, లివర్, మూత్రపిండాలు, నేత్రాలు వంటి అవయవాలు సేకరించి వివిధ జిల్లాలకు, రాష్ట్రాలకు పంపాం. ప్రభుత్వం కూడా అవయవదానం చేసే వారిపట్ల ఆదరణ చూపాలని పిలుపు నివ్వటం శుభసూచకం.

- డాక్టర్ హరిప్రసాద్‌రెడ్డి, నారాయణ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి, సూపరింటెండెంట్

ప్రజల్లో చైతన్యం తీసుకురావాల్సి ఉంది



జిల్లాలో ఎందరో అవయవదాతలు ఉన్నారు. ప్రధానంగా బ్రెయిడ్ డెడ్ అయ్యే వారి నుంచి ఎక్కువగా అవయవాలను సేకరిస్తున్నాం. గుండె, ఇతర అవయవాలను హైదరాబాద్‌తో పాటు ఇతర జిల్లాలకు పంపాం. రాష్ట్ర ప్రభుత్వం తాజాగా అవయవ దానాన్ని ప్రోత్సహించటం అభినందనీయం. అవయవదానంపై ప్రజలలో చైతన్యం తీసుకురావాల్సి ఉంది.

- గిరినాయుడు, కిమ్స్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి ఈడీ

ఉపరాష్ట్రపతి పర్యటనకు పటిష్ట ఏర్పాట్లు : కలెక్టర్

నెల్లూరు(హరనాథపురం), ఆగస్టు 12 : భారత ఉపరాష్ట్రపతి జగదీష్ ధన్కర్ జిల్లా పర్యటనకు ప్రొటోకాల్ నిబంధనల మేరకు పటిష్ట ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ఆనంద్ అధికారులను ఆదేశించారు. సోమవారం తిక్కన భవన్‌లో అధికారులతో సమీక్షించిన కలెక్టర్ మాట్లాడుతూ ఉపరాష్ట్రపతి పర్యటన కార్యక్రమంలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. పోలీసు బందోబస్తు ఏర్పాట్లకు పక్క జిల్లాల నుంచి పోలీసులను పిలిపించాలన్నారు. పోలీసు కవాతు మైదానంలో మూడు హెలిపాడ్‌లను సిద్ధం చేయాలన్నారు. కవాతు మైదానం నుంచి స్వర్ణభారత్ ట్రస్ట్ కార్యక్రమం ముగించుకుని తిరిగి కవాతు మైదానం చేరే వరకు అధికారులు విధులను బాధ్యతతో నిర్వహించాలన్నారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ సూర్యతేజ, డీఆర్వో లవన్న తదితరులు పాల్గొన్నారు.

చెట్టును ఢీ కొని కారు బోల్తా : ఇద్దరు యువకుల మృతి

మర్రిపాడు, ఆగస్టు 12: బూద వాడ సమీపంలోని 565వ నెంబర్ జాతీయ రహదారిపై సోమవారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదం లో గ్రామానికి చెందిన శ్రీనివాసులు రెడ్డి (30), వెంకటేశ్వర్లు (28) మృతి చెందారు. వీరు సరదాగా పక్కనే ఉన్న కృష్ణాపురం గ్రామానికి కారులో వెళ్లారు. తిరిగి వస్తుండగా అదుపు తప్పి రోడ్డు పక్కన ఉన్న చెట్టును ఢీకొని బోల్తా కొట్టింది. కారు డ్రైవింగ్ చేస్తున్న యానాదిరెడ్డి స్వల్ప గాయాలయ్యాయి. పోలీసులు సంఘనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేశారు. మృతదేహాలను పంచనామా నిమిత్తం ఆత్మకూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

ఇసుక తరలింపు ట్రాక్టర్ల సీజ్

అల్లూరు, ఆగస్టు 12: అక్రమంగా ఇసుకను తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను సీజ్ చేసినట్టు ఎస్ఐ శ్రీనివాసులు రెడ్డి తెలిపారు. సోమవారం వేకుజామున మండలంంలోని ముదివర్తి నుంచి ఎలాంటి బిల్లులు లేకుండా అల్లూరు మీదుగా ఇసుకను తరలిస్తుండగా విధుల్లో ఉన్న తమ సిబ్బంది అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. ఇసుకను అక్రమ రవాణా చేస్తే వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఇసుక టిప్పర్ పట్టివేత

ఆత్మకూరు, ఆగస్టు 12: దేపూరు వద్ద ఉన్న ఇసుకను సోమవారం తెల్లవారుజామున అక్రమంగా తరలిస్తున్న టిప్పర్‌ను సీఐ గంగాధర్‌రావు గుర్తించి అదుపులోకి తీసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. టిప్పర్‌లో ఉన్న పులి కృష్ణారెడ్డిని అరెస్ట్ చేశారు. ఈయన ప్రకాశం జిల్లా, చీమకుర్తి మండలం బొడ్డుకూరుపాడువాసి. ఈ సందర్భంగా సీఐ గంగాధర్ మాట్లాడారు. ఇసుక అక్రమ రవాణాపై ప్రత్యేకదృష్టి సారించామన్నారు. అందులో భాగంగా దేపూరు, నాగులుపాడు సమీప ప్రాంతాల్లో ఆదివారం రాత్రి సిబ్బందితో కలిసి తిరుగుతుండగా ఈ టిప్పర్ పట్టుపడిందన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి చర్యలు తీసుకుంటామన్నారు. ఆత్మకూరు సర్కిల్ పరిధిలో ఇసుక అక్రమరవాణా, గంజాయి విక్రయాల నియంత్రణకు ప్రత్యేక నిఘా ఉంచామన్నారు.

హెచ్ఐవీ నియంత్రణకు ప్రత్యేక కార్యక్రమం

● జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పెంచలయ్య

నెల్లూరు(వైద్యం), ఆగస్టు 12 : హెచ్ఐవీ, ఎయిడ్స్ నివారణకు ప్రత్యేక కార్యక్రమం చేపడుతున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పెంచలయ్య తెలిపారు. సోమవారం డీఎంహెచ్‌వో కార్యాలయంలో హెచ్ఐవీ నివారణకు అవగాహన కల్పించే పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ రెండు నెలల పాటు న్యాకో సూచనలకు అనుగుణంగా 'మీకు తెలుసా ప్రచార కార్యక్రమం' చేపడుతున్నామన్నారు. జిల్లా జనాభాలో సుఖవ్యాదులు, హెచ్ఐవీపై విస్తృత అవగాహన కల్పిస్తున్నామని చెప్పారు. హెచ్ఐవీ ఉన్నవారు ఎఆర్‌టీ సెంటర్‌లలో తమ పేరు నమోదు చేసుకుని పూర్తిస్థాయి చికిత్స పొంది ప్రాణాపాయం నుంచి బయటపడాలని కోరారు. హెచ్ఐవీ నియంత్రణ అధికారి డాక్టర్ ఖాదర్‌వలి మాట్లాడుతూ హెచ్ఐవీ ఎలా సోకుతుందో సామాజిక మాధ్యమాల ద్వారా వివరిస్తామని, రెడ్‌రిబ్బన్ కార్యక్రమాల ద్వారా విద్యార్థులకు అవగాహన కల్పిస్తామన్నారు. ఇందులో స్వచ్ఛంద సంస్థలు భాగస్వాములు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సునీల్‌కుమార్, శివ, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


పోస్టర్ ఆవిష్కరిస్తున్న డీఎంహెచ్‌వో, వైద్యులు

● వ్యాధి నిరోధక టీకాల లక్ష్యాన్ని అధిగమించండి

చిన్నారులకు వ్యాధి నిరోధక టీకాల లక్ష్యాన్ని అధిగమించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పెంచలయ్య ఆదేశించారు. సోమవారం డీఎంహెచ్‌వో కార్యాలయంలో నెల్లూరు, ఆత్మకూరు, కందుకూరు, కావలి డివిజన్‌లకు చెందిన వైద్యులు, సూపర్‌వైజర్లతో ఆయన సమీక్షించి మాట్లాడుతూ గతంతో పోలిస్తే వ్యాధి నిరోధక టీకాల అమలులో సత్ఫలితాలు వచ్చాయన్నారు. ఇదే రీతిలో చిన్నారులకు వ్యాధి నిరోధక టీకాలు వేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు జిల్లా వైద్యాధికారి డాక్టర్ ఖాదర్‌వలి, వ్యాధి నిరోధక టీకాల అధికారి డాక్టర్ ఉమామహేశ్వరి, వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్ సర్వలెన్స్ అధికారి డాక్టర్ మోనిక థామస్, తదితరులు పాల్గొన్నారు.

డీఎస్ఏ ఆధ్వర్యంలో క్రీడాకారుల ర్యాలీ

నెల్లూరు(విద్య), ఆగస్టు 12 : అంతర్జాతీయ యువజన దినోత్సవాన్ని పురస్కరించుకుని హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా సోమవారం జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో క్రీడాకారులు నగరంలో ర్యాలీ నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన అదనపు ఎస్పీ సీహెచ్ సౌజన్య స్వామి వివేకానంద చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించిన అనంతరం ర్యాలీని ప్రారంభించారు. ఈ ర్యాలీ ఏసీ సుబ్బారెడ్డి స్టేడియం నుంచి ప్రారంభమైన కరెంట్ ఆఫీస్ మీదుగా తిరిగి ఏసీ స్టేడియంకు చేరుకుంది. అనంతరం క్రీడాకారులకు వివిధ క్రీడాంశాల్లో పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సెట్నల్ సీఈవో వై.వెంకటయ్య, జిల్లా క్రీడాభివృద్ధి అధికారి ఆర్‌కె.యతిరాజ్, ఎన్‌వైకే యూత్ కోఆర్డినేటర్ మ హేంద్రరెడ్డి, డిఎస్ఏ కోచ్‌లు, సిబ్బంది పాల్గొన్నారు.


ర్యాలీ ప్రారంభిస్తున్న ఏఎస్పీ, అధికారులు

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో
బాయిలర్ లైవ్	103
లేయర్ లైవ్	95
స్కిన్ చికెన్	196
స్కిన్‌లెస్	216
లేయర్	161

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ.6667
వెండి కిలో ధర	రూ. 83,300
వెండి ఒక గ్రాము	రూ. 85.30

గంటల తరబడి నిలబెట్టేశారు..!

- డీఆర్‌డీఏలో వివరాల నమోదు
- తిక్కన భవన్‌లో టోకన్ల పంపిణీ
- అటూ ఇటూ వెళ్లలేక నిరీక్షించిన ప్రజలు
- కలెక్టరేట్ పీజీఆర్ఎస్‌లో అర్జీదారులకు చుక్కలు

నెల్లూరు(హరనాథపురం), ఆగస్టు 12 : కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో జనానికి చుక్కలు చూపించారు. అర్జీలు సమర్పించేందుకు అర్జీదారులు గంటల తరబడి వేచి ఉండాల్సిన పరిస్థితి కల్పించారు. కలెక్టరేట్ ప్రాంగణంలోని డీఆర్‌డీఏ కార్యాలయంలో శాఖల వారీగా ఏర్పాటు చేసిన ప్రత్యేక కౌంటర్‌లలో అర్జీలకు నెంబరు వేయించుకోవాలి. అనంతరం కలెక్టరేట్ తిక్కన ప్రాంగణానికి వచ్చి క్యూలో నిలబడి అధికారులకు అర్జీలు సమర్పించాలి. ఈ క్రమంలో అర్జీదారులు ఎక్కువ సంఖ్యలో రావడంతో డీఆర్‌డీఏ కార్యాలయంలో అర్జీ నమోదు కోసం గంటల తరబడి నిరీక్షించిన అనంతరం తిక్కన ప్రాంగణానికి వచ్చారు. అక్కడ సిబ్బంది వారికి టోకన్లు ఇచ్చి గంటల తరబడి నిలుచోబెట్టారు. దీంతో అర్జీదారులు దాహం తీర్చుకోలేక, అక్కడ నుంచి వెనుదిరిగి వెళ్లలేక నానా అవస్థలు పడ్డారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన అర్జీదారులకు కనీసం కూర్చోడానికి తిక్కన ప్రాంగణంలో కుర్చీలు కూడా ఏర్పాటు చేయలేదు. దీంతో అర్జీలు సమర్పించేందుకు అవస్థలు పడ్డారు. కాగా కలెక్టర్ ఆనంద్ స్వయంగా అర్జీలు స్వీకరించి సమస్యలు తెలుసుకుని సంబంధిత అధికారులను పిలిపించి అలసత్వం లేకుండా పరిష్కరించాలని ఆదేశించారు. అర్జీల పరిష్కారంలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో లవన్న తదితరులు పాల్గొన్నారు.


అర్జీదారుల సమస్యను వింటున్న కలెక్టర్ ఆనంద్

● మైనింగ్ వ్యాపారం జరిగేలా చూడాలి

జిల్లాలో మైనింగ్ కార్యక్రమాలు తిరిగి ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ సౌత్ ఇండియా మైనింగ్ ఓనర్స్ అసోసియేషన్, ఏపీ మైనింగ్ ఓనర్స్ ఫెడరేషన్ అధ్యక్షుడు ద్వారకానాథ్‌రెడ్డి, మినరల్స్ చాంబర్ ఆఫ్ కామర్స్ జిల్లా అధ్యక్షుడు ప్రణయ్‌రెడ్డి కలెక్టర్ ఆనంద్‌కు వినతిపత్రం సమర్పించారు.

● ఆక్రమణలను తొలగించాలి

నగరానికి సమీపంలోని వడ్డిపాళెం వద్ద పెరిగిపోయిన ఆక్రమణలు తొలగించాలని కోరుతూ వడ్డిపాళెంకు చెందిన యనమల సురేంద్ర, రామయ్య, గుండ్లపాళెం, బాబానగర్ ప్రాంతవాసులు కలెక్టర్ ఆనంద్‌కు వినతిపత్రం సమర్పించారు. నారాయణ వైద్యశాల ప్రాంతంలో ఆర్‌అండ్‌బీ రోడ్డు మార్జిన్‌లో ఇరిగేషన్ కాలువను ఆక్రమించి అక్రమంగా షాపులు నిర్మించారని ఆరోపించారు. అక్రమణల వలన రోడ్డు కుచించుకుపోయి నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు.

● జగజ్జీవన్‌రామ్ భవంతి నిర్మించాలి

నగరంలోని కొత్తూరులో కేటాయించి స్థలంలో బాబూ జగజ్జీవన్‌రామ్ భవన్ నిర్మించాలని కోరుతూ సీమాంధ్ర ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు పందిటి సుబ్బయ్య మాదిగ కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు.


కలెక్టరేట్ ప్రాంగణంలో మాట్లాడుతున్న మైనింగ్ సంఘాల నాయకులు

బాధితులకు సత్వర న్యాయం జరగాలి

● ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో ఎస్పీ కృష్ణకాంత్


ఫిర్యాదు దారులతో మాట్లాడుతున్న ఎస్పీ కృష్ణకాంత్, ఏఎస్పీ సౌజన్య తదితరులు

నెల్లూరు(క్రైం), ఆగస్టు 12: ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో వచ్చిన ఫిర్యాదులను క్షుణ్ణంగా పరిశీలించి చట్టపరిధిలో పరిష్కరించి బాధితులకు సత్వర న్యాయం జరిగేలా చూడాలని ఎస్పీ జీ కృష కాంత్ పోలీసు అధికారుల ను ఆదేశించారు. సోమవారం ఉమేష్‌చంద్ర కాన్ఫరె న్స్ హాలులో ఎస్పీ కృష్ణకాంత్ పీజీఆర్ఎస్ కార్యక్రమంలో జిల్లా నలుమూలల నుంచి వచ్చిన 98 మంది బాధితుల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడతూ ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చొరవ చూపుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ సీహెచ్ సౌజన్య, నగర డిఎస్పీ డీ శ్రీనివాసరెడ్డి, లీగల్ అడ్వైజర్ శ్రీనివాసులరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టీవీలు, కియోస్క్ యంత్రాలు పనిచేసేలా చర్యలు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

దుత్తలూరు(ఉదయగిరి రూరల్), ఆగస్టు 12: రైతుసేవా కేంద్రాల్లో మూలన పారవేసిన టీవీలు, కియోస్క్ యంత్రాలు పనిచేసేలా చర్యలు తీసుకున్నట్లు ఉదయగిరి వ్యవసాయ సహాయసంచాలకులు చెన్నారెడ్డి తెలిపారు. ఆదివారం ఆంధ్రజ్యోతి దినపత్రికలో 'రూ.లక్షలు వెచ్చించారు.. లక్ష్యాన్ని మరిచారు..' అనే కథనం ప్రచురితమైంది. జిల్లా వ్యవసాయాధికారిణి సత్యవాణి స్పందించి వెంటనే వాటిని ఉపయోగంలోకి తీసుకోవాలన్న ఆదేశాల మేరకు సోమవారం మండల వ్యవసాయాధికారి ఎస్.వెంకట సుబ్బారెడ్డితో కలిసి దుత్తలూరు, లక్ష్మీపురం రైతుసేవా కేంద్రాల్లో టీవీలు, కియోస్క్ యంత్రాలను మరమ్మతులు చేయించి ఉపయోగంలోకి తీసుకొచ్చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వ్యవసాయంలో నూతన పద్ధతులు, ప్రభుత్వ కార్యక్రమాలు, పాడి పంటలు తదితర కార్యక్రమాలు టీవీల ద్వారా చూపిస్తామన్నారు. కియోస్క్ యంత్రాల తో విత్తనాల పంపిణీ, ఇండెం ట్ కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. బిందు, తుంపర్ల సేద్య పరికరాల కోసం ఆర్ఎస్‌కేల్లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వీఏఏ అంకిత పాల్గొన్నారు.


దుత్తలూరులో కియోస్క్ యంత్రంలో ఇండెంట్‌ను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు

సోమశిలకు 14918 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

అనంతసాగరం, ఆగస్టు 12: సోమశిల జలాశయానికి ఎగువ నుంచి సోమవారం 14,918 క్యూసెక్కుల ప్రవాహం వస్తున్నట్లు అధికారులు తెలిపారు. పూర్తిస్థాయి నీటి సామర్థ్యం 77.988 టీఎంసీలు కాగా ప్రస్తుతం 18.013 టీఎంసీల నీరు నిల్వ ఉంది. దిగువ డెల్టా, ఉత్తర, దక్షిణ కాలువలకు 210 క్యూసెక్కులు సరఫరా చేస్తున్నారు.

విద్యుదాఘాతంతో యువకుడి మృతి

కావలి, ఆగస్టు 12: కావలి పట్టణంలోని తుఫాన్‌నగర్ నవవికాస్‌సెంటర్‌కు చెందిన తన్నీరు అశోక్ (19) టైల్స్ పనికి వెళ్లి సోమవారం సాయంత్రం విద్యుదాఘాతంలో మృతి చెందాడు. ఈ ఘటన పట్టణ టీచర్స్ కాలనీలో చోటుచేసుకుంది. పోలీస్‌ల కథనం మేరకు ఈ యువకుడు హరిజనవాడకు చెందిన శెట్టిపల్లి రాఘవేంద్ర మేస్త్రీ వెంట టైల్స్ పనికి పోతుంటాడు. టీచర్స్ కాలనీలోని బోనుముక్కల ప్రసాద్‌రెడ్డి ఇంటిదగ్గర టైల్స్‌పని చేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్ తగిలి మృతి చెందాడు. మృతుడి తండ్రి కొండలరావు ఫిర్యాదు మేరకు రూరల్ సీఐ శ్రీనివాసరావు కేసు నమోదు చేశాడు.

టీచర్ల సర్దుబాటును నిలిపివేయాలి : ఫ్యాప్టో నిరసన

నెల్లూరు(విద్య), ఆగస్టు 12 : పాఠశాలల్లో మిగులు ఉపాధ్యాయుల సర్దుబాటు ప్రక్రియను నిలిపివేయాలని ఫ్యాప్టో నేతలు డిమాండ్ చేశారు. ఉపాధ్యాయుల సర్దబాటుకు వ్యతిరేకంగా నెల్లూరులో సోమవారం నిరసన తెలిపారు. అనంతరం విద్యాశాఖ అధికారులకు వినతిపత్రం అందజేశారు. నాయకులు మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం తీసుకువచ్చిన జీవో నెం 117 ప్రకారం సర్దుబాటు చేయడం వల్ల పాఠశాలల్లో ఉపాధ్యాయులు తగ్గిపోతారని, పేద విద్యార్థులు బడికి దూరమవుతారన్నారు. దీన్ని నిలుపుదల చేసి 2020లో ఇచ్చిన జీవో నెం 53 ప్రకారం ఉపాధ్యాయుల సర్దుబాటు చేపట్టాలన్నారు. ఉన్నత పాఠశాలల్లో సబ్జెక్ట్ టీచర్లను కొనసాగించాలని, ఉర్దూ మీడియం విద్యార్థులకు ప్రత్యేకంగా టీచర్లను కేటాయించాలన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ ఉపాధ్యాయ సంఘాల నేతలు పాల్గొన్నారు.

ఎంఈవో కోసం ఉపాధ్యాయుల ధర్నా

● ఖాళీ కుర్చీకి వినతిపత్రం

మనుబోలు, ఆగస్టు 12: మండలానికి రెగ్యులర్ ఎంఈవోను నియమించాలని సోమవారం ఎమ్మార్సీ భవనం వద్ద ఫ్యాప్టో ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ 117 జీవోని వెంటనే రద్దుచేయాలన్నారు. పనిసర్దుబాటు విధానాన్ని తీసివేయాలన్నారు. దీని వలన ఉపాధ్యాయులు చాలా ఇబ్బందులు పడుతున్నారన్నారు. రెండు నెలలుగా మండలానికి రెగ్యులర్ ఎంఈవోని నియమించలేదని, ఇన్‌చార్జి ఎంఈవో ఒకరోజు వచ్చి మరలా సెలవులో వెళ్లిపోతున్నారన్నారు. మండలానికి రెగ్యులర్ ఎంఈవోను నియమిచాలని, దీనిపై డీఈవో, కలెక్టర్ స్పందించాలని ఉపాధ్యాయులు కోరారు. అనంతరం ఖాళీ కుర్చీకి వినతిపత్రం ఇచ్చి నిరసన తెలిపారు.


ఎమ్మార్సీ భవనం వద్ద ధర్నా చేస్తున్న ఉపాధ్యాయులు

రాజకీయ జోక్యంతో రాజ్యాంగ వ్యతిరేక తీర్పులు

● సుప్రీం తీర్పును వ్యతిరేకిస్తూ మాలమహానాడు ధర్నా

నెల్లూరు(హరనాథపురం), ఆగస్టు 12 : కోర్టులు సైతం నేడు రాజకీయ జోక్యంతో రాజ్యాంగ వ్యతిరేక తీర్పులు ఇస్తున్నాయని మాలమహానాడు రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు స్వర్ణ వెంకయ్య ఆరోపించారు. 2004లో ఎస్సీ వర్గీకరణ రాజ్యాంగ పరమైందని, వర్గీకరణ చేయడానికి రాష్ట్రాలకు ఎలాంటి అధికారం లేదని తీర్పు చెప్పిన సుప్రీం కోర్టు ఆగస్టు 1వ తేదీన అందుకు భిన్నంగా తీర్పు ఇవ్వడమే ఇందుకు నిదర్శనమన్నారు. దీనిని వ్యతిరేకిస్తూ మాలమహానాడు నాయకులు సోమవారం నగరంలో భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా స్వర్ణ వెంకయ్య మాట్లాడుతూ మోదీ ప్రభుత్వం వర్గీకరణపేరుతో ఎస్సీలను విడదీయాలని చూస్తోందని, భవిష్యత్తులో రిజర్వేషన్‌లు ఎత్తేయాలని ప్రయత్నిస్తోందని ఆరోపించారు. వర్గీకరణకు నాలుగు రాష్ట్రాలు తప్ప మిగిలిన రాష్ట్రాలు ఒప్పుకోలేదన్నారు. వర్గీకరణ జరిగితే మాదిగ, మాల సామాజిక వర్గాలు మాత్రమే లబ్ధిపొందుతాయన్నారు. ఎస్సీ వర్గీకరణ అశాస్త్రీయమైదని, జనాభా రీత్యా రిజర్వేషన్లు పెంచాలన్నారు. మాలలపట్ల జరుగుతున్న అన్యాయానికి ప్రతిగా నిరసన కార్యక్రమాలు చేపడుతామన్నారు. అనంతరం కలెక్టర్ ఆనంద్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ ఏసునాయుడు, మాలమహానాడు జిల్లా అధ్యక్షుడు బల్లి వెంకయ్య, ఉద్యోగసంఘ రాష్ట్ర నాయకులు మోహన్‌కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న మాలమహానాడు నాయకులు

ఎరువుల వినియోగంపై అవగాహన తప్పనిసరి

● కొనుగోలులో జాగ్రత్తలు పాటించాలి

● అన్నదాతకు అధికారుల సూచనలు

సీతారామపురం, ఆగస్టు 12: ఖరీఫ్, రబీ సీజన్‌లలో ఎరువులు, పురుగు మందుల వాడకం అధికంగా ఉంటుంది. ఇలాంటి సమయంలో మార్కెట్లోకి నకిలీ ఎరువులు వచ్చే అవకాశం ఉందని వ్యవసాయాధికారులు హెచ్చరిస్తున్నారు. ఈ సీజన్‌లో ఎరువులు, పురుగుమందులు కొనుగోలు చేసే విషయంలో రైతులు జాగ్రత్తలు తీసు కోవాలనివారు సూచిస్తున్నారు. అజాగ్రత్తగా ఉంటే నిలువునా మోసపోయే అవకాశం ఉందన్నారు. నిషేధిత పురుగు మందులు కొనుగోలు చేస్తే నిలువునా మునిగి పోయినట్టే అంటున్నారు. పంట దిగుబడి అధికంగా వస్తుందని నమ్మించి కొంత మంది అనుమతి లేని కంపెనీల ఎరువులు, మందులు రైతులకు అంటగట్టే అవకాశం ఉంది. దుకాణాలలో తక్కువ ధరకే పురుగు మందులు ఎరువులు విక్రయిస్తున్నారని వాటిని కొనుగోలు చేయరాదు. అవి కంపెనీ మందులా.. లేక స్థానికంగా తయారు చేసి విక్రయిస్తున్నారా అనే విషయాలను రైతులు తెలుసుకోవాలి. ఎరువులు, పురుగు మందులు కొనుగోలు చేసినపుడు తప్పనిసరిగా బిల్లులు తీసుకోవాలి. లైసెన్స్‌లేని దుకాణాలు, దళారుల వద్ద కొనుగోలు చేయరాదు.

● అనుమతులు ఉండాలి

మండల వ్యవసాయాధికారి చెన్నారెడ్డి

ప్రభుత్వ అనుమతి ఉన్న దుకాణాల్లోనే ఎరువులు, మందులు, విత్తనాలు కొనుగోలు చేయాలి. అవసరమైనవి కొనుగోలు చేసినట్లయితే తప్పనిసరిగా ఆ షాపు యజమాని సంతకం చేసిన బిల్లులను రైతులు తీసుకోవాలి. క్రిమి సంహారక మందులను కొనుగోలు చేసే సమయంలో డబ్బాపై ఉన్న వివరాలు పరిశీలించాలి. అర్థం కాకపోతే తెలిసిన వారికి చూపించాలి. మందులు పిచికారీ గురించి ముద్రించిన కరపత్రాలు తీసుకోవాలి. మందులు, విత్తనాలు కొనుగోలు చేసిన డబ్బాలు, సంచులను పంట దిగుబడి చేతికివచ్చేంత వరకు భద్రపరచాలి. ఒకవేళ నష్టం వస్తే సంబంధిత డీలర్‌పై కేసులు నమోదు చేయడానికి ఉపయోగపడతాయి.





సీతారామపురంలో విక్రయాలకు సిద్ధంగా పురుగు మందులు

సీఐ గంగాధర్‌రావుకు సన్మానం



సన్మానిస్తున్న టీడీపీ నేతలు

ఆత్మకూరు, ఆగస్టు 12 : స్థానిక సర్కిల్ ఇన్‌స్పెక్టర్ గంగాధర్‌రావును సోమవారం టీడీపీ నాయకుడు, మాజీ ఉపసర్పంచ్ చల్లా రవికుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో పలువురు నేతలు, మున్సిపల్ కౌన్సిలర్లు మర్యాదపూర్వకంగా సీఐని కలిసి సన్మానించారు. శాంతిభద్రతలపై ప్రత్యేక దృష్టి సారించాలని, అందుకు తమవంతు సహకారం అందిస్తామన్నారు. ముందుగా వారు తహసీల్దారు సుధీర్‌ను సన్మానించారు. కార్యక్రమంలో మున్సిపల్ కో ఆప్షన్ సభ్యుడు కొత్తపల్లి రమేష్, కౌన్సిలర్లు మాదాల శ్రీనివాసులనాయుడు, షేక్ గౌస్‌బాష, గందళ్ల వేణు, టీడీపీ నేతలు నలిశెట్టి శ్రీనివాసులు, కముజుల ప్రసాద్‌రెడ్డి, అంబటి నాగేశ్వరరావు, చల్లా మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

బాధితురాలికి ఆర్థిక సాయం

ఆత్మకూరు, ఆగస్టు 12: పట్టణంలోని 17వ వార్డుకు చెందిన షేక్ షర్మిల ఇటీవల ఆటో ప్రమాదానికి గురి కావడంతో ఆరోగ్య సమస్యలు తలెత్తి, ఆపరేషన్ చేయాల్సిన పరిస్థితి నెలకుంది. విషయం తెలుసుకున్న వెంకటేశ్వర ప్రజావైద్యశాల ఎండీ డాక్టర్ జాగర్లమూడి ప్రణీత్ వింజం దొరసానమ్మ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా సోమవారం బాధితురాలి కుటుంబసభ్యులకు రూ.10వేలను అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ కుమార్, డాక్టర్ వెంకట సందీప్, తోడేటి అశోక్ పాల్గొన్నారు.

సమావేశ మందిరం ప్రారంభం

ఆత్మకూరు, ఆగస్టు 12: మహిమలూరు పంచాయతీలోని కోటపాడులో నూతనంగా నిర్మించిన బీఆర్ అంబేడ్కర్ సమావేశ మందిరాన్ని సోమవారం సర్పంచ్ పట్టెడ చంద్రశేఖర్, ఏఎస్‌పేట మోడల్ స్కూల్, జూనియర్ కాలేజి జువాలజీ లెక్చరర్ గంధం వెంకటరామయ్య ప్రారంభించారు. గ్రామ ప్రజల అవసరనిమిత్తం మంది రాన్ని నిర్మించామన్నారు. అనంతరం టీడీపీ రాష్ట్ర కార్య దర్శి దావా పెంచలరావు అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి సేవలను కొనియాడారు. న్యాయవాది నం దా ఓబులేశు, ప్రజాసంఘాలు, స్వచ్ఛంద సంస్థల అధ్యక్షులు, అంబేడ్కర్ ఇండియా మిషన్ కార్యకర్తలు పాల్గొన్నా రు.

ఉన్నతాధికారుల ఆరా

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

వరికుంటపాడు, ఆగస్టు 12: యర్రంరెడ్డిపల్లిలో పనిచేయని తాగునీటి పథకానికి సంబంధించి సోమవారం ఆర్‌డబ్ల్యూఎస్ ఉన్నతాధికారులు ఆరా తీసినట్లు తెలిసింది. ఆదివారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన పంచాయతీ నిధులు దుర్వినియోగం కథనానికి స్పందించిన డీఈ లక్ష్మణ్‌నాయక్, ఏఈలు ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తులతో పాటు సంబంధిత సిబ్బందితో మాట్లాడి త్వరితగతిన పనులు చేపట్టాలని సూచించినట్లు సమాచారం. విషయం బట్టబయలవడంతో గుమ్మడి కాయల దొంగ బుజాలు తడుముకున్నట్లు అన్న చందంగా తమకేమి సంబంధం లేదన్నట్లుగా ఉద్యోగులు మౌనవ్రతం పాటిస్తుండడం గమనార్హం. రంగంలోకి దిగిన ఉన్నతాధికారులు ఎలాంటి చర్యలు చేపట్టి తాగునీటి పథకానికి మరమ్మతులు చేయిస్తారో వేచి చూడాలి మరి.

బెల్టు షాపులు నిర్వహిస్తే చర్యలు



హోటల్లో తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు

వరికుంటపాడు, ఆగస్టు 12: మండలంలో ఎవరైనా సరే బెల్టు షాపులు దుకాణాలు నిర్వహిస్తే చర్యలు తప్పవని ఎస్ఐ తిరుపతయ్య హెచ్చరించారు. సోమవారం విరువూరుకు చెందిన కొంతమంది మహిళలు అందించిన ఫిర్యాదు మేరకు స్పందించిన ఆయన సిబ్బందితో విరువూరుతో పాటు సమీప కోటవర్ధినిపల్లిలోని హోటళ్లు, కిరాణ దుకాణాల్లో విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించిన వారిపై కేసులు నమోదు చేస్తామన్నారు. పల్లెల్లో ప్రశాంత వాతా వరణానికి ప్రతిఇక్కరూ తమవంతు బాధ్యతగా సహక రించా లన్నారు. రాత్రి సమయంలో అమ్మకాలు జరుగకుండా సిబ్బందితో పహారా ఏర్పాటు చేస్తామన్నారు.

గ్రామాభివృద్ధే లక్ష్యంగా పనిచేయాలి

ఆత్మకూరు, ఆగస్టు 12: సర్పంచులు, కార్యదర్శులు గ్రామాభివృద్ధే లక్ష్యంగా పనిచేయాలని ఇన్‌చార్జి ఎంపీడీవో శ్రీనివాసులు, ఈవోపీఆర్డీ ఉషారాణి తెలిపారు. స్థానిక మండల కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం ఎంపీపీ కేతా వేణుగోపాల్‌రెడ్డి అధ్యక్షతన సర్పంచులు, కార్యదర్శులకు రిఫ్రెషర్ ట్రైనింగ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ.. గ్రామపంచాయతీ పాలన, సుస్థిరత అభివృద్ధి లక్ష్యాలు, పారిశుధ్య అంశాలపై వివరించారు. గ్రామాల్లో పారిశుధ్య మెరుగుదలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఘన వ్యర్థాల నిర్వహణ, చెత్త సేకరణ, పొడి, చెత్త వేరుచేయుట, వర్మీకంపోస్టు తయారీ, మార్కెటింగ్‌లో ఎస్‌హెచ్‌జీ సభ్యులు, ప్రజల భాగస్వామ్యంపై విపులీకరించారు. అభివృద్ధి ప్రణాళిక మేర పనులకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ముందుగా డ్రగ్ ఫ్రీ ఇండియా ప్రచారంలో భాగంగా అధికారులు, సర్పంచులు, కార్యదర్శులు ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో మాస్టర్ ట్రైనీ షేక్ షఫీ, మండల రిసోర్స్ కో ఆర్డినేటర్ పాల్గొన్నారు.

సీతారామపురం: స్థానిక మండల కార్యాలయంలో ఇన్‌చార్జి ఎంపీడీవో వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో సర్పంచులకు శిక్షణ తరగతులు ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీడీవో, ఈవోఆర్డీ భార్గవిలు అభివృద్ధి పనులను గురించి వివరించారు.

సంగం: స్థానిక మండల కార్యాలయంలో సర్పంచులు, కార్యదర్శులకు శిక్షణా తరగతులు ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీడీవో గోపి, డీఎల్‌పీఓ నారాయణరావు, తెలిపారు.

ఉదయగిరి రూరల్: స్థానిక స్త్రీశక్తి భవనంలో సర్పంచులు, కార్యదర్శులకు శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీడీవో దేవరకొండ ఈశ్వరమ్మ, ఈవోపీఆర్డీ మల్లికార్జున, శిక్షకులు షేక్ కరీముల్లా, ఖాదర్‌కరీముల్లా, కార్యదర్శులు నాగూర్‌బీ, చంద్రశేఖర్, తేజ, ఆంజనేయులు, వీరేంద్ర, శిల్ప తదితరులు పాల్గొన్నారు.

పని సర్దుబాటు కౌన్సెలింగ్ బహిష్కరణ

ఉదయగిరి రూరల్, ఆగస్టు 12: ఫ్యాప్టో రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు మండలస్థాయి పని సర్దుబాటు కౌన్సెలింగ్‌ను సోమవారం ఉదయగిరిలో ఉపాధ్యాయులు బహిష్కరించారు. అనంతరం ఎంఈవో-2 తోట శ్రీనివాసులకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఫ్యాప్టో సంఘం నాయకులు దస్తగిరిఅహ్మద్, షేక్ఎండీ ఖాజా, రామిరెడ్డి, మీనిగ ఫజిరాజ్, నల్లబోతుల రామకృష్ణ, షబ్బీర్, ఫయాజ్ పాల్గొన్నారు.



ఉదయగిరిలో ఎంఈవోకు వినతిపత్రం అందజేస్తున్న ఫ్యాప్టో నాయకులు

సీతారామపురం. ఆగస్టు 12: ఉపాధ్యాయుల పని సర్దుబాటు ప్రక్రియ అసంబద్ధంగా ఉండటం వలన ఉపాధ్యాయ సంఘాలు విజ్ఞప్తులను ఏ మాత్రం పరిగణలోకి తీసుకోకుండా ముందుకు వెళ్తున్న దరమిల ఫ్యాప్టో పని సర్దుబాటు ప్రక్రియను బహిష్కరిస్తున్నట్లుగా ఆ సంఘం మండల నాయకులు సోమవారం మండల విద్యాధికారి షేక్ మస్తాన్‌వలికి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో యూటీఎఫ్ ప్రధాన కార్యదర్శి గొడ్లవేటి వెం కటేశ్వర్లు, ఏపీటీఎఫ్ ప్రధాన కార్యదర్శి రవిచంద్ర, దేవరాజు, మహేష్ పాల్గొన్నారు.

ఏఎస్ పేట: ఉపాధ్యాయుల పని సర్దుబాటు ప్రక్రియ అంతా అసంబద్ధంగా ఉండడంతో బహిష్కరించినట్లు ఫ్యాప్టో సంఘం నాయకులు తెలిపారు. సోమవారం వారు మండల విద్యాశాఖ అధికారిణి జ్యోతికి విన్నతిపత్రం అందజేశారు.

తహసీల్దారుకు డీలర్ల సన్మానం

ఉదయగిరి రూరల్, ఆగస్టు 12: నూతనంగా బాధ్యతలు చేపట్టిన తహసీల్దారు ఎం.సుభద్రను సోమవారం కార్యాలయంలో మండల చౌకదుకాణాల డీలర్లు సన్మానించి పుష్పగుచ్ఛం అందజేశారు. డీలర్లు సకాలంలో డీడీలు చెల్లించి కార్డుదారులకు నిత్యావసర వస్తువులు పంపిణీ చేయాలని తహసీల్దారు సూచించారు. కార్యక్రమంలో చౌక దుకాణాల డీలర్లు ఖాదర్‌బాషా, ఏసుదాసు, ఫయాజ్, నాయబ్, ఆదాం, ఆరీఫా తదితరులు పాల్గొన్నారు.

జామాయిల్ చెట్ల నరికవేతకు అనుమతి ఉండాలి

ఉదయగిరి రూరల్, ఆగస్టు 12: మండల రైతులు సాగు చేసిన జామాయిల్ చెట్ల నరికివేతకు అనుమతులు తప్పనిసరి అని తహసీల్దారు ఎం.సుభద్ర తెలిపారు. సోమవారం ఆమె ఈ విషయంపై విలేకరు లతో మాట్లాడారు. అసైన్డ్, సెటిల్‌మెంట్ పొలాల్లో సాగు చేసిన జామాయిల్ నరికివేతకు సంబంధిత వీఆర్వోకు దరఖాస్తు చేసుకుంటే పరిశీలించి అనుమతి మంజూరు చేస్తామన్నారు. రైతులు సాగు చేసిన జామాయిల్ చెట్లను కొంతమంది అక్రమా ర్కులు గుట్టుచప్పుడు కాకుండా నరికి అక్రమ రవాణా చేస్తుండడంతో రైతుల ఫిర్యాదు మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు.

విరివిగా రుణాలు అందిస్తాం

ఏఎస్ పేట, ఆగస్టు 12: అర్హులకు రుణాలందిస్తామని ఎన్‌డీసీసీ బ్యాంక్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి ఎస్.శ్రీనివాస్ తెలిపారు. సోమవారం ఆయన మండలకేం ద్రంలోని ఎన్‌డీసీసీ బ్యాంక్‌ను తనిఖీ చేశారు. రూ.15లక్షలు అంత కంటే ఎక్కువ డిపాజిట్ చేస్తే అత్యధిక వడ్డీ అందజేస్తామన్నా రు. అనంతరం రాజవోలు సొ సైటీని తనిఖీ చేశారు. ప్యాక్ కంప్యూటరైజేషన్ వర్క్‌ను వేగవంతం చేయాలని సూచించారు. కార్యక్రమంలో పేట బ్రాంచ్ మేనేజరు సుబ్బారెడ్డి, సొసైటీ సిబ్బంది రమేష్ పాల్గొన్నారు.


రెవెన్యూలో విలీనం చేయాలని వినతి



వినతిపత్రం అందజేస్తున్న సచివాలయ వీఆర్వోలు

ఉదయగిరి రూరల్, ఆగస్టు 12: మండలంలో గ్రేడ్-2 గ్రామ రెవెన్యూ అధికారులుగా పనిచేస్తున్న తమను రెవెన్యూ శాఖలో విలీనం చేయాలని సోమవారం సచివాలయ వీఆర్వోలు తహసీల్దారు ఎం.సుభద్రకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రెవెన్యూ శాఖలో తమకు కేటాయించిన జాబ్‌చార్ట్ ప్రకారం విధులు నిర్వహిస్తూ అదనంగా వ్యవసాయ, హౌసింగ్, పంచాయతీరాజ్ శాఖల విధులను కూడా నిర్వహిసున్నట్లు చెప్పారు. స్పందించిన తహసీల్దారు సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతామన్నారు. కార్యక్రమంలో వీఆర్వోలు అంజాద్, వెంకట్, మస్తాన్, అనూష, దయానశ్రీ పాల్గొన్నారు.

ఘనంగా రంగనాథన్ జయంతి



అనంతసాగరం, ఆగస్టు 12: స్థానిక ఉన్నత పాఠశాలలో సోమవారం గణిత, గ్రంథాలయ శాస్త్రవేత్త రామామృత రంగనాథన్ జయంతిని నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం లక్ష్మీ ప్రసన్న, గ్రంథపాలకుడు నారాయణరావు, హాస్టల్ వార్డెన్ శ్రీనివాసులు పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణ

వరికుంటపాడు, ఆగస్టు 12: మండల తహసీల్దారుగా సోమవారం ఎస్ఎండీ హంసేన్ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆ యన మాట్లాడారు. ప్రజలు, రైతులు ఎదుర్కొంటున్న రెవెన్యూ సమస్యలు పరిష్కరిస్తామన్నారు.

వెలుగోటితో కంభం భేటీ

వింజమూరు, ఆగస్టు 12: ఏపీఎస్‌జీజీటీఎస్ అధ్యక్షుడు వెలుగోటి మధును సోమవారం ఉదయగిరి మాజీ ఎమ్మెల్యే కంభం విజయరామిరెడ్డి దంతపతులు ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం వెలుగోటి మధు దంపతులు వారిని మర్యాదపూర్వకంగా ఆహ్వానించి శాలువా, పూలమాలతో సన్మానించారు. వీరి భేటిలో 3 మండలాల ఉద్యోగులు సమస్యలు, వింజమూరు రాజకీయ అంశాలపై చర్చించారు.

శివాలయంలో ప్రత్యేక పూజలు

దుత్తలూరు(ఉదయగిరి రూరల్), ఆగస్టు 12: దుత్తలూరు కొండపై వెలసిన రామలింగేశ్వరస్వామి ఆలయంలో శ్రావణమాస సోమవారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు స్వామి వారికి అభిషేకాలు చేసి విశేష అలంకరణలు చేపట్టారు. .

మెకానిక్‌ల అసోసియేషన్ ఎన్నిక

వింజమూరు, ఆగస్టు 12: మండల మెకానిక్ వర్క్స్, ఆటోమొబైల్స్ షాపులు నిర్వాహకులు నూతన యూనియన్‌ను ఏర్పాటు చేశారు. దానికి ద వింజమూరు ఆటో మొబైల్స్ డీలర్స్ టెక్నికల్ వర్క్స్ హెల్పర్ అసోసియేషన్ నామకరణం చేశారు. సోమవారం స్థానిక పంచముఖ ఆంజనేయస్వామి ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన సమావేశంలో బైక్ మెకానిక్‌లు, ట్రాక్టర్ మెకానిక్‌లు, ఆటో మొబైల్ షాపుల సభ్యులు, ఎలక్ట్రికల్స్, కొయ్యల దుకాణాలు వర్కర్స్, మెకానిక్‌లు పాల్గొన్నారు.

జలజీవన్ మిషన్

అక్రమాలపై చర్య తీసుకోవాలి



ఆర్డీవోకు వినతిపత్రం ఇస్తున్న నారాయణపురం రైతులు

ప్రజాసమస్యల పరిష్కారవేదికకు 8 అర్జీలు

కావలి, ఆగస్టు 12: స్థానిక ఆర్డీవో కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజాసమస్యల పరిష్కారవేదికకు కావలి డివిజన్‌లోని వివిధ ప్రాంతాల నుంచి సమస్యలు పరిష్కారం కోరుతూ 8అర్జీలు వచ్చాయి. బీజేపీ పట్టణ అధ్యక్షుడు బ్రహ్మానందం ఆధ్వర్యంలో నేతలు డివిజన్‌లో జలజీవన్ మిషన్‌లో జరిగిన అక్రమాలపై చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రతి ఇంటికి కొళాయి ద్వారా మంచినీరు ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వం జలజీవన్‌మిషన్‌ను ప్రారంభిస్తే గత వైసీపీ ప్రభుత్వంలో కొళాయి కనెక్షన్‌లు ఇవ్వకుండా అధికారులు, కాంట్రాక్టర్లతో కుమ్మక్కై అవినీతికి పాల్పడ్డారని మండిపడ్డారు. దగదర్తి మండలం నారాయణపురంకు చెందిన రైతులు తమ భూములను అటవీశాఖ అధికారులు తమవని ఇబ్బందులు పెడుతున్నారని దానిపై కోర్టుకు వెళ్లగా కోర్టు మాకు అనుకూలంగా తీర్పు ఇచ్చిందని చెప్పారు. ఈ భూములకు వన్‌బీ అడంగల్ ఇప్పించాలని ఆర్డీవో శీనానాయక్‌ను కోరామని, ఆయన తహసీల్దార్‌తో మాట్లాడి వారం రోజుల్లో వచ్చేలా చూస్తానని తెలిపారని గుర్తు చేశారు. అల్లూరు మండలం పడమరగోగుల పల్లికి చెందిన రైతులు తమ డీకేటీ భూములను ఆ గ్రామానికి చెందిన వైసీపీ నాయకుడు పోలేరమ్మగుడి పేరు చెప్పి లాగేసుకుని ఆయన ఆధీనంలో ఉంచుకున్నారని ఫిర్యాదు చేశారు. ఆ భూములను తిరిగి మాకు అప్పగించాలని విన్నవించారు.

తన భూమిని మరొకరిపేరుకు మార్చారని ఫిర్యాదు

కొండాపురం. ఆగస్టు 12: ప్రభుత్వం తమకు ఇచ్చిన అసైన్డ్ భూమిని గ్రామంలోని మరొకరిపేరుకు మార్చారంటూ సత్యవోలు పంచాయతీలోని లింగనపాలెంకు చెందిన కోట వెంకటేశ్వర్లు సోమవారం డిప్యూటీ తహసీల్దార్ కోటేశ్వరరావుకు గ్రీవెన్స్ డేలో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. 10-01-2008లో ఎఫ్‌డీసీ నెంబరు 901-1417తో నా భార్య కోట శివరంజని పేరుతో సర్వే నెంబరు 275ఎలో ప్రభుత్వం 3.20 సెంట్లు భూమిని మంజూరు చేసిందన్నారు. దీనికి సంబంధించి పట్టాదారు పాసుపుస్తకం, టైటిల్ డీడ్ రెవెన్యూ అధికారులు మంజూరు చేశారన్నారు. మా గ్రామానికి ఎటువంటి సంబంధంలేని వ్యక్తులు షేక్ షఫీ ఉల్లా, సయ్యద్ ఫరీదాభేగం, షేక్ జుబేదా, షేక్ సనవుల్లా అనే వ్యక్తులు గత నెల 17వ తేదీన సదరు భూమిలోకి అక్రమంగా వచ్చి జేసీబీతో చదును చేయుస్తుండగా విషయం తెలుసుకుని తాను అక్కడకు వెళ్లి ప్రభుత్వం మాకు పట్టా ఇస్తే మీరు ఇక్కడకు వచ్చి ఎందుకు చదును చేస్తున్నానని ప్రశ్నించగా మాకే పట్టా ఇచ్చి ఉన్నారు, ఈ భూమి మాది అని నాపై దౌర్జన్యం చేసి బెదిరించారని వినతిలో పేర్కొన్నారు. ఈ విషయంలో తనకు న్యాయం చేయాలని కోరారు.

ప్రజాసమస్యలు పరిష్కరించాలి

కందుకూరు, ఆగస్టు 12: కందుకూరు మున్సిపాలిటీలో సోమవారం నిర్వహించిన ప్రజాఫిర్యాదుల వేదికలో 6 అర్జీలు వచ్చినట్లు కమిషనర్ కేవీ కృష్ణారెడ్డి తెలిపారు. సమస్యల సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకోవాల్సిందిగా ఆయా సెక్షన్ హెడ్‌లకు ఆదేశాలు జారీచేశారు. పారిశుధ్యం, వీధిలైట్లు, తాగునీటి సమస్యలను ఫోన్‌ద్వారా తెలియజేసినా తక్షణ పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు.

కందుకూరులో హర్ ఘర్ తిరంగా ర్యాలీ



ర్యాలీలో సబ్‌కలెక్టర్, ఉద్యోగులు, సిబ్బంది, విద్యార్థులు

కందుకూరు, ఆగస్టు 12: ఆజాదీకా అమృత్ మహోత్సవ్ హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా సహకార శాఖ ఆధ్వర్యంలో సోమవారం కందుకూరు పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. సబ్ కలెక్టరు జీ విద్యాధరి తన కార్యాలయం వద్ద జెండా ఊపి ర్యాలీని ప్రారంభించగా, స్థానిక ఉన్నత పాఠశాల విద్యార్థినీ, విద్యార్థులతో కలిసి సహకార ఉద్యోగులు అంబేడ్కర్ విగ్రహం సెంటర్ మీదుగా పోస్టాఫీసు సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా హర్ ఘర్ తిరంగా నినాదంతో విద్యార్థులు హోరెత్తించారు. కార్యక్రమంలో డివిజన్ సహకార అధికారి కె రవిచంద్రారెడ్డి, ఉప విభాగేయ సహకార అధికారి కేవీ సుబ్బారావు, డిప్యూటీ తహసిల్దార్ పి బ్రహ్మయ్య, కె లక్ష్మీప్రసన్న, బాలుర ఉన్నత పాఠశాల హెచ్‌ఎం నరసింహమూర్తి, రెవిన్యూ ఉద్యోగులు, పిడిసిసి బ్యాంక్ సిబ్బంది, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల సిబ్బంది పాల్గొన్నారు.

స్వాతంత్ర్య వేడుకలకు అన్ని ఏర్పాట్లు

అల్లూరు : స్వాతంత్ర్య దినోత్సవానికి అన్ని ఏర్పాట్లు సిద్ధం చేస్తున్నట్లు ఎంపీడీవో జ్యోతి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. మండలాధ్యక్షురాలు దర్శిగుంట శశిరేఖ జెండా ఆవిష్కరణలో ముఖ్య అతిథిగా పాల్గొంటారని పేర్కొన్నారు.

తల్లిదండ్రుల ఆశయాలు సాధించాలి : ఎమ్మెల్యే ఇంటూరి



విద్యార్థులకు పుస్తకాలు, బ్యాగ్‌లు అందిస్తున్న ఎమ్మెల్యే

ఉలవపాడు, ఆగస్టు 12 : తల్లిదండ్రుల ఆశయాలు సాధించేలా విద్యార్థులు చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని కందుకూరు నియోజకవర్గ ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు సూచించారు. సోమవారం ఉలవపాడు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఇంటర్ విద్యార్థులకు పాఠ్య, నోటు పుస్తకాలు, బ్యాగుల పంపిణీ ఎమ్మెల్యే చేతుల మీదుగా చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ప్రభుత్వంలో సగం విద్యా సంవత్సరం పూర్తయ్యాక పుస్తకాలు ఇచ్చేవారని, కానీ కూటమి ప్రభుత్వంలో విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ప్రత్యేక చొరవతో విద్యా సంవత్సరం ప్రారంభంలోనే పుస్తకాలు అందించడం హర్షణీయమన్నారు. కాగా, నియోజకవర్గంలోని అన్ని కాలేజీలు, హైస్కూల్స్‌లో అత్యధిక మార్కులు సాధించిన మొదటి ముగ్గురు విద్యార్థులకు ప్రతి సంవత్సరం ప్రోత్సాహక బహుమతులు తన సొంత నిధులతో అందచేస్తానని ఎమ్మెల్యే ప్రకటించారు. అనంతరం దాతలు హేచరీస్ యజమానుల ఆధ్వర్యంలో కాలేజీ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కాలేజి ప్రిన్సిపాల్ గోపిచంద్ ప్రకాష్, ఎంఈవోలు శివనాగేశ్వరరావు, రమణయ్య, సంధ్యా హేచరీస్ నిర్వాహకులు సుబ్బాజీ, అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.


డీఆర్ సేవలు మరువలేనివి : శ్రీనివాస కిరణ్

కావలి, ఆగస్టు 12: విశ్వోదయ వ్యవస్థాపకులు దొడ్ల రామచంద్రారెడ్డి(డీఆర్) గొప్ప విద్యాప్రదాత, మానవతావాదని సమాజానికి ఆయన చేసిన సేవలు అమూల్యమని మాజీ మున్సిపల్ ఛైర్మన్ నగ్గ శ్రీనివాసకిరణ్ కొనియాడారు. డీఆర్ విశ్వోదయ సేవాసమితి ఆధ్వర్యంలో సోమవారం వెంగళరావునగర్‌లోని సమితి కార్యాలయంలో 60మంది నిరుపేద వృద్ధులకు రూ.60వేల విలువ చేసే నిత్యావసరాలు, నగదు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాసకిరణ్ మాట్లాడారు. తండ్రి బాటలో ఆయన కుమారులు విద్యాధర్‌రెడ్డి, వినయకుమార్ రెడ్డిలు విద్యాలయాలు, సేవా కార్యక్రమాలు నిర్వహించటం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో విశ్వోదయ రెక్టార్ దొడ్ల వినయకుమార్ రెడ్డి, సేవాసమితి ఛైర్‌పర్సన్ దొడ్ల లక్ష్మీ, డైరెక్టర్ కూనం తాతిరెడ్డి, రామ్‌సెంటర్ ఛైర్మన్ మనోహర్‌రెడ్డి, జేబీ డిగ్రీకళాశాల ప్రిన్సిపాల్ సుబ్రహ్మణ్యం నాయుడు, విశ్రాంత ప్రిన్సిపాల్ ఆర్ మాల్యాద్రి పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు పరామర్శ

కావలి, ఆగస్టు 12: స్థానిక ముసునూరు తెలుగుదేశం నాయకులు కండ్లగుంట మధు నాయుడు, రవినాయుడుల తల్లి రత్నమ్మ మృతి చెందింది. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే దగుమాటి వెంకట క్రిష్ణారెడ్డి సోమవారం ఆమె పార్థి వదేహాన్ని సందర్శించి నివాళులర్పించి కుటుంబ సభ్యులకు సాను భూతి తెలిపారు. అలాగే స్థానిక బాపూజీనగర్‌కు చెందిన గువ్వల సురేష్ మృతి చెందగా ఆయన పార్థివ దేహాన్ని సందర్శించి నివాళులర్పించారు.

రైతుల సమస్యలు పరిష్కరించండి : టీడీపీ



తహసీల్దారుకు వినతిపత్రం అందజేస్తున్న టీడీపీ నేతలు

బిట్రగుంట, ఆగస్టు 12: మండల రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని టీడీపీ మండల కన్వీనర్ మాలేపాటి నాగేశ్వరావు, స్థానిక నేతలు తహసీల్దారు సురేష్ బాబుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాలేపాటి మాట్లాడారు. రైతుల భూములకు సంబంధించిన సర్వే నంబర్లలో తప్పు, 1బీ అడంగల్ రాక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. కొందరు ప్రైవేటు లేఅవుట్ల వారు రైతు పొల్లాలోకి వ్యర్థపు నీరు పోయేందుకు కాలువలు తీశారని వాటిని తొలగించాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు కోడూరు వెంకటేశ్వర్లురెడ్డి, ఎల్.సుధీర్‌బాబు, గనేషం రమేష్‌రెడ్డి, యర్రం వెంకటేశ్వర్లు రెడ్డి, రావి విజయ్‌కుమార్ యాదవ్, అన్నంగి ఆదిశేషయ్య, వాకా మహేష్‌రెడ్డి ఉన్నారు.

హోరాహోరీగా ఎడ్ల బండలాగుడు పోటీలు

బిట్రగుంట, ఆగస్టు 12: బోగోలు మండలం ముంగమూరు పంచాయతీ పేటగ్రామంలోని పోలేరమ్మ ఆలయ వార్షికోత్సవం సందర్భంగా సోమవారం రాష్ట్రస్థాయి ఎడ్ల బండలాగుడు పోటీలు నిర్వహించారు. హోరాహోరీగా జరిగిన ఈ పోటీల్లో కడప, నంద్యాల, ప్రకాశం, నెల్లూరు జిల్లాల నుంచి ఎడ్లు పాల్గొన్నాయి. కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి పోటీలను ప్రారంభించారు. కావలి పట్టణ బీజేపీ అధ్యక్షుడు కుట్టుబోయిన బ్రహ్మానందం, నాయుడు రాంప్రసాద్, మండల టీడీపీ నేతలను గ్రామస్థులు ఎమ్మెల్యేకు స్వాగతం పలికారు. ఆలయంలో ప్రత్యేక పూజల అనంతరం ఎమ్మెల్యేని సన్మానించారు. మొదటి బహుమతిగా నంద్యాల జిల్లా ఎడ్లకు రూ.50వేలు, ప్రకాశం, కడప జిల్లా ఎడ్లకు వరుసగా రూ.40 వేలు, రూ.30 వేల నగదును అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు ఒంటేరు మల్లికార్జున, యన్నాబత్తిన శ్రీనివాసులు, కేతిరెడ్డి శ్రీనివాసులురెడ్డి, కే.చంద్రారెడ్డి, కాసల దయాకర్ యాదవ్ పాల్గొన్నారు.



పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వెంకటక్రిష్ణారెడ్డి

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్

కందుకూరు, ఆగస్టు 12: కందుకూరు పట్టణంలోని రౌడీషీటర్లకు సీఐ కే వెంకటేశ్వరరావు సోమవారం పట్టణ పోలీస్‌స్టేషన్‌లో కౌన్సెలింగ్ నిర్వహించారు. ఇటీవలికాలంలో రౌడీషీటర్ల ప్రవర్తన, వారి నడవడికను తెలుసుకుని ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలలో పాల్గొన్నా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో పట్టణ ఎస్ఐ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర ఎరువుల వాడకమే సాగుకు లాభదాయకం: ఏడీఏ

కావలి రూరల్, ఆగస్టు 12: సమగ్ర ఎరువుల వాడకమే సాగునకు లాభదాయకమని జలవనరుల కేంద్రం జిల్లా సహాయ వ్యవసాయ సంచాలకులు మారుతీదేవి తెలిపారు. మండలంలోని గౌరవరంలో ఆత్మ ఆధ్వర్యంలో నిర్వహించిన సేంద్రియ వ్యవసాయం, సమగ్ర ఎరువుల వాడకంపై సోమవారం రైతులకు శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న నెల్లూరు, కావలి ఏడీఏలు మారుతీదేవి, నాగరాజులు మాట్లాడారు. వరిసాగులో మేలైన యాజమాన్య పద్ధతులతో నాణ్యమైన దిగుబడులు సాధించవచ్చన్నారు. సేంద్రియ ఎరువులు, జీవన ఎరువులు వాడకంతోపాటు భూసార పరీక్షలు చేయించుకోవాల రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వనరుల కేంద్రం ఏవోలు శైలజ, మధురిమ, గీతాకుమారి, కావలి ఏవో లలిత, వీఏఏలు, రైతులు పాల్గొన్నారు.

పంచాయతీల అభివృద్ధికి కృషిచేయాలి

లింగసముద్రం, ఆగస్టు 12: గ్రామ పంచాయతీల అభివృద్ధికి సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు కృషి చేయాలని ఎంపీపీ పెన్నా కృష్ణయ్య సూచించారు. సోమవారం ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో శ్రీనివాసులు అధ్యక్షతన జరిగిన శిక్షణా కార్యక్రమం ప్రారంభం సందర్భంగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, మహాత్మాగాంధీల చిత్ర పటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో శ్రీనివాసులు, ఈఓఆర్డీ రామసుబ్బారావు మాట్లాడుతూ గ్రామాలలో పారిశుధ్యం, వీధిలైట్ల నిర్వహణకు చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే వేస్ట్ మేనేజ్‌మెంట్, పంచాయతీ విద్యుత్ బిల్లులు చెల్లించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ శిక్షణ మరో రెండు రోజులు జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

రైల్వే కార్మికులకు డీఏ బకాయిలు చెల్లించాలి

బిట్రగుంట, ఆగస్టు 12: కష్టపడి పనిచేస్తున్న రైల్వేకార్మికుల 18నెలల డీఏ బకాయిలను వెంటనే విడుదల చేయాలని సౌత్‌సెంట్రల్ రైల్వే మజ్దూర్ యూనియన్ బిట్రగుంట బ్రాంచ్ ఛైర్మన్ ఎంవీ శేఖర్‌యాదవ్, కార్యదర్శి సీహెచ్ వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. ఈ విషయంపై సోమవారం వారు మజ్దూర్ యూనియన్ నాయకులతో కలిసి బిట్రగుంట రైల్వే పీడబ్ల్యూఐ కార్యాలయం ఎదుట నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. పాత పింఛన్ విధానాన్ని కొనసాగించాలని, 8వ వేతన సంఘం ఏర్పాటు చేసి 1-1-2026 నుంచి వేతన సవరణ చేయాలన్నారు. రైల్వేలో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని, మహిళ ఉద్యోగులను ట్రాక్ మెన్, రన్నింగ్ డిపార్ట్‌మెంట్ల నుంచి ఇతర డిపార్ట్‌మెంట్లకు బదిలీ చేయాలని తెలిపారు. అలాగే కార్మికులను రిఫెరల్ హాస్పటల్‌లో నేరుగా అడ్మిట్ అయేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అందరికీ 8గంటల పని విధానం అమలు చేయాలని, లోకో పైలట్లకు విశ్రాంతి సమయాన్ని పొడిగించాలన్నారు. కార్య క్రమంలో మజ్దూర్ యూనియన్ సభ్యులు మైకేల్, మధు, రఘు, శ్రీహరి, క్రాంతి, మాధవి, మహేంద్ర, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

గురుకులాల్లో 8వ తరగతి ప్రవేశ పరీక్ష

బిట్రగుంట, ఆగస్టు 12: బోగోలు మండలం కప్పరాళ్లతిప్పలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో 8వ తరగతి చేరేందుకు అర్హులైన విద్యార్థులకు ప్రవేశ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ పద్మావతి సోమవారం సాయంత్రం తెలిపారు. బీసీ-1, ఎస్టీ-3 సీట్లు ఖాళీలు ఉన్నాయని ఆసక్తి ఉన్న విద్యార్థులు ఈ నెల 14వ తేదీ ఉదయం 10గంటలకు ప్రవేశ పరీక్షకు ఆధారు కార్డుతో రావాలని కోరారు.

డీబీఎస్‌లో యువజన దినోత్సవం

కావలిటౌన్, ఆగస్టు 12: అంతర్జాతీయ యువజన దినోత్సవాన్ని సోమవారం స్థానిక మద్దూరుపాడులోని డీబీఎస్ ఇంజనీరింగ్ కళాశాలలో ఘనంగా నిర్వహించారు. వేడుకల్లో కరస్పాండెంట్ దామిశెట్టి సుధీర్‌నాయుడు, ప్రిన్సిపాల్ టీవీ రావులు యువజన దినోత్సవం ప్రాముఖ్యతను తెలిపారు. యువత సమస్యలు, హక్కులపై అవగాహన పెంపొందించడానికి సామాజిక అభివృద్ధిలో యువత భాగస్వామ్యం చేసి ప్రోత్సహించేందుకు ఈ వేడుకలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. అనంతరం విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు.

విద్యార్థుల భవిష్యత్తుకు బంగారు బాటలు వేయాలి

● అధ్యాపకులకు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి ఉద్బోధ

బుచ్చిరెడ్డిపాళెం, ఆగస్టు 12: విద్యార్థుల భవిష్యత్తుకు బంగారు బాటలు వేయాలని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి కళాశాల అధ్యాపకులను కోరారు. సోమవారం బుచ్చిరెడ్డిపాళెంలోని ఎస్‌కేఆర్‌ఎస్, డీఎల్‌ఎన్‌ఆర్ జూనియర్ కళాశాలలో విద్యార్థినీ, విద్యార్థులకు విద్యాశాఖామంత్రి నారా లోకేష్‌బాబు ప్రవేశపెట్టిన పాఠ్య, నోటు పుస్తకాలు, విద్యా కిట్లు ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ముందుగా ఎమ్మెల్యే కళాశాల నిర్మాణ దాత దొడ్ల లక్ష్మీనరసారెడ్డి విగ్రహానికి, సరస్వతీదేవికి పూలమాలలు వేసి విద్యాకిట్లు పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం టీడీపీ కార్యాలయంలో నగర పంచాయతీతోపాటు మండలంలోని అన్ని గ్రామాల నాయకులు, కార్యకర్తల సమస్యలను అడిగి తెలుసుకుని మండలానికి మంజూరైన పలు అభివృద్ధి పనులను కేటాయించారు. ఈ కార్యక్రమంలో ఆర్టైఓ ఆదూరి శ్రీనివాసులు, తహసీల్దారు అంబటి వెంకటేశ్వర్లు, నగర కమిషనర్ రమణబాబు, ప్రిన్సిపల్, కౌన్సిలర్ వైష్ణవి, టీడీపీ నాయకులు ఏటూరి శివరామకృష్ణారెడ్డి, ఎంపీ శేషయ్య, హరికృష్ణ, హరనాథ్, సుబ్రహ్మణ్యం నాయుడు, బి మురళీకృష్ణ, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



బుచ్చి : విద్యార్థులకు పుస్తకాలు, విద్యా కిట్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి

ప్రభుత్వ కార్యాలయాలకు నేతల చిత్రపటాల వితరణ

పొదలకూరు, ఆగస్టు 12: పట్టణంలోని ప్రభుత్వ కార్యాలయాలకు మండల టీడీపీ అధ్యక్షుడు తలచీరు మస్తాన్‌బాబు, ఉపాధ్యక్షుడు గంటా మల్లికార్జున్‌యాదవ్, పట్టణాధ్యక్షుడు బొద్దులూరు మల్లికార్జుననాయుడు ఆధ్వర్యంలో సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి చిత్రపటాలను సోమవారం బహూకరించారు. తహసీల్దారు కార్యాలయంలో తహసీల్దారు సారంగపాణికి, ఎంపీడీవో కార్యాలయంలో మహమ్మద్ రఫీకి, 4 సచివాలయాల్లో కార్యదర్శి దొరబాబుకు అందజేశారు.

బీసీజీ వ్యాక్సినేషన్ పూర్తిచేయాలి

మనుబోలు, ఆగస్టు 12: గ్రామాల్లో బీసీజీ వ్యాక్సినేషన్ నూరుశాతం పూర్తిచేయాలని జిల్లా అదనపు వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డా. ఖాదర్‌వలి సిబ్బందికి సూచించారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని ఆయన సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించి సిబ్బందితో సమీక్షించారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌వో రాజయ్య, తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల అభివృద్ధిలో ముందుంటాం

స్థానిక బాలుర ఉన్నత పాఠశాలను అభివృద్ధి చేయడంలో తాము ముందుంటామని ఇటీవల ఎన్నికైన విద్యాకమిటీ పేర్కొంది. సోమవారం పాఠశాలలో నూతన కమిటీ సభ్యులను పాఠశాల హెచ్‌ఎం డేవిడ్ ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కమిటీ ఛైర్మన్ బి రవీంద్ర, కోఆప్షన్ సభ్యులు కలికి రమేష్‌రెడ్డి, టీడీపీ నాయకులు రాయపాటి కిరణ్, పాల్గొన్నారు.

తహసీల్దార్‌కు సన్మానం

స్థానిక తహసీల్దార్ సిహెచ్ సుబ్బయ్యను సోమవారం పలువురు బీజేపీ, టీడీపీ నేతలు కలిసి సన్మానించారు. కార్యక్రమంలో బీజేపి మండలాధ్యక్షుడు వెంకటకృష్ణారెడ్డి, నాయకులు బోలా శ్రీనువాసులు, వాసిరెడ్డి రామిరెడ్డి, టీడీపీ నాయకులు వెడిచెర్ల వెంకటరమణారెడ్డి, చిట్టిబాబు, తదితరులు పాల్గొన్నారు.

117 జీవోను రద్దు చేయాలి

రాపూరు(డక్కిలి), ఆగస్టు 12: ఉపాధ్యాయులకు నష్టం కలిగించేలా ఉన్న 117 జీవోను ప్రభుత్వం వెంటనే రద్దు చేసి ఉపాధ్యాయుల సర్దుబాటు చేయాలని ఫ్యాప్టో మండల యూనియన్ నాయకులు సోమవారం ఎంఈవో శ్రీనివాసులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఫ్యాప్టో యూనియన్ నాయకులు ఎస్‌డీ అక్రమ్, రాపూరు శ్రీనివాసులు, బాలప్రసాద్ మాట్లాడారు. కార్యక్రమంలో మండల ఫ్యాప్టో నాయకులు పాల్గొన్నారు.

మైనింగ్ కార్మికుల ధర్నా

సైదాపురం, ఆగస్టు 12: స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట సోమవారం మైనింగ్ కార్మికులు ధర్నా చేపట్టి తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మూడు నెలల నుంచి మైనింగ్ కార్యకలాపాలు మూతవేయడంతో జీవనోపాధి కోల్పోయామని, కొనసాగేలా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

కాలువలో పూడికతీత

కోవూరు, ఆగస్టు 12: ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి సొంత నిధులతో సోమవారం స్టాటీడీ కాలనీ - పోతిరెడ్డిపాలెం మధ్యనున్న కుండతూము కాలువ పూడికతీత పనులు చేపట్టారు. టీడీపీ నాయకులు గండవరపు రవిచంద్ర, పఠాన్ నజీర్, నాటకరాని శ్రీకాంత్, పామంజి వినోద్, రహీమ్, అమీర్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే సొంత నిధులతో ఏర్పాటుచేసిన ఎక్సకవేటరును ఉపయోగించి పూడిక తీయించారు. ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డిని పలువురు రైతులు అభినందించారు.

కొత్తూరులో హర్ ఘర్ తిరంగా

ఇందుకూరుపేట, ఆగస్టు 12: మండలంలోని కొత్తూరులో బీజేపీ జిల్లా అధ్యక్షుడు వంశీధర్‌రెడ్డి ఆదేశాల మేరకు మత్స్యకార జిల్లా అధ్యక్షుడు గాంధీ, జిల్లా కార్యవర్గ సభ్యుడు కైలాసం శ్రీనివాసులురెడ్డి ఆధ్వర్యంలో సోమవారం హర్ ఘర్ తిరంగా కార్యక్రమం జరిగింది. మండల పరిషత్ కార్యాలయంలో గాంధీజీ విగ్రహం దగ్గర స్వచ్ఛ భారత్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అవినాష్‌రెడ్డి, పరంధామయ్య, శరత్, వెంకయ్య, వెంకటశేషయ్య, శ్రీనివాసులు, పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ పోరాటంతోనే ఎస్సీ వర్గీకరణ

రాపూరు(డక్కిలి), ఆగస్టు 12 : ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ పోరాట ఫలితమే ఎస్సీవర్గీకరణ సాధ్యం అయ్యిందని ఎమ్మార్పీఎస్ జిల్లా అధికార ప్రతినిధి గోవింద రంగయ్య మాదిగ అన్నారు. రాపూరులో సోమవారం నిర్వహించిన మాదిగల పోరాట విజయోత్సవ సభలో ఆయన మాట్లాడారు. అంతకు ముందు మోదీ, చంద్రబాబు, పవన్‌కళ్యాణ్, మందకృష్ణ మాదిగల చిత్రపటానికి పాలభిషేకం నిర్వహించారు.

చట్టాలపై అవగాహన అవసరం

వెంకటాచలం, ఆగస్టు 12: ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని న్యాయసేవాధికార సంస్థ జిల్లా కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జీ కే వాణి సూచించారు. మండలంలోని కురిచెర్లపాడు గిరిజన కాలనీలో సోమవారం కసుమూరు పీహెచ్‌సీ ఆధ్వర్యంలో వైద్య శిబిరం, న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. గిరిజనులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని, ఉచితంగా న్యాయసేవలు అందించడం జరుగుతుందన్నారు. ఎస్టీ, ఎస్సీ చట్టాల గురించి ఆమె వివరించారు. గ్రామీణ ప్రాంతాల్లో బాల్య వివాహాలు అరికట్టాలన్నారు. లోక్ అదాలత్ ద్వారా సమస్యలు పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యురాలు డాక్టర్ హర్షియా, డాక్టర్ అనురాధ, బ్రహ్మయ్య తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న న్యాయ సేవాధికార సంస్థ జిల్లా కార్యదర్శి వాణి

విద్యార్థులు ర్యాగింగ్‌కు దూరంగా ఉండాలి

విక్రమ సింహపురి యూనివర్సిటీలో సోమవారం యాంటీ ర్యాగింగ్ దినోత్సవం నిర్వహించారు. ముఖ్య అతిథిగా వీసీ డాక్టర్ ఎస్ విజయభాస్కర్‌రావు విచ్చేసి మాట్లాడుతూ ర్యాగింగ్‌కు విద్యార్థులు దూరంగా ఉండాలని సూచించారు. సీనియర్ విద్యార్థులు జూనియర్లతో సఖ్యతతో మెలగాలన్నారు. కార్యక్రమంలో వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ కే సునీత, వర్సిటీ కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్ విజయ తదితరులున్నారు.

ప్రైవేటు బీఈడీ కళాశాలలపై చర్యలు తీసుకోవాలి

విక్రమ సింహపురి యూనివర్సిటీ పరిధిలో ఉన్న ప్రైవేటు బీఈడీ కళాశాలలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఏపీ బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ పర్నూరు నారాయణగౌడ్ స్థానిక వీఎస్‌యూలో వర్సిటీ వీసీ డాక్టర్ ఎస్ విజయభాస్కర్‌రావుకు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రైవేటు బీఈడీ కళాశాలలు ఎన్‌సీటీఈ, యూనివర్సిటీ నిబంధనలను ఉల్లంఘించి ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నాయన్నారు. కళాశాలల తనిఖీ చేపట్టి నిబంధనలను అతిక్రమిస్తున్న కళాశాలల గుర్తింపు రద్దుచేయాలని డిమాండ్ చేశారు.

డీప్ బోర్లతో అడుగంటుతున్న భూగర్భ జలాలు

● గ్రామస్థుల ఆందోళన

ముత్తుకూరు, ఆగస్టు 12 : మండలంలో డీప్‌బోర్లు వేసి నీటిని తోడివేస్తుండడంతో భూగర్భ జలాలు అడుగంటుతున్నాయని గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేశారు. సోమవారం టీడీపీ, బీజేపీ కూటమి నాయకులతో కలిసి తహసీల్దారు బాలకృష్ణారెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలోని ముత్తుకూరు, వల్లూరు, మల్లూరు, బ్రహ్మదేవం, పంటపాలెం, పిడతాపోలూరు, ఇతర పంచాయతీలో 250 డీప్‌బోర్లు వేసి ఇష్టారీతిన నీటిని తోడేస్తూ రొయ్యల సాగు చేస్తున్నారని, దీంతో గ్రామాల్లో తాగునీటి సమస్యలు ఏర్పడ్డాయని, చెరువుల్లో నీరు ఉప్పుమయంగా మారి కలుషితమై పంటలు పండించుకోలేకున్నామని వాపోయారు. మండలంలో వాల్టా చట్టాన్ని అమలు చేస్తూ తక్షణం డీప్ బోర్లను తొలగించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు పల్లంరెడ్డి రామ్మోహన్‌రెడ్డి, సీనియర్ టీడీపీ నాయకుడు ఈదూరు రామ్మోహన్‌రెడ్డి, సర్వేపల్లి నియోజకవర్గం జనసేన నాయకుడు బొబ్బేపల్లి సురేష్‌నాయుడు, బీజేపీ నాయకులు కాకుటూరు రవీందర్‌రెడ్డి, పాల్గొన్నారు.



గ్రామస్థులతో కలిసి తహసీల్దారుకు వినతిపత్రం అంజేస్తున్న కూటమి నాయకులు

పంచాయతీల అభివృద్ధికి కలసికట్టుగా పనిచేయాలి

మనుబోలు, ఆగస్టు 12: గ్రామ పంచాయతీల అభివృద్ధికి సర్పంచులు, కార్యదర్శులు కలిసికట్టుగా పనిచేయాలని శిక్షణా తరగతుల రాష్ట్ర పరిశీలకులు, డీపీవో జి రాజ్యలక్ష్మీ సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సర్పంచులకు, కార్యదర్శులకు మూడురోజుల పాటు నిర్వహించే శిక్షణా తరగతులను సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పంచాయతీల్లో ఎలాంటి సమస్యలు ఎదురైనా సత్వరమే పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గుండాల వజ్రమ్మ, పంచాయతీ విస్తరణాధికారి జీవిఎస్‌వి ప్రసాద్,ఏవో రవికుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మనుబోలు: మాట్లాడుతున్న డీపీవో

సైదాపురం: స్థానిక మండల కార్యాలయంలో సోమవారం ఎంపీడీవో పురుషోత్తం శివకుమార్ అధ్యక్షతన పంచాయతీ అభివృద్ధిపై సర్పంచులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ముందుగా మహాత్మగాంధీ, బీఆర్ అంబేద్కర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో పలు అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ చిత్తలూరు పోలయ్య , కార్యదర్శులు, ఏపీఎం రాధ, అంగన్‌వాడీ సూపర్ వైజర్లు పాల్గొన్నారు.

అంబేద్కర్ విగ్రహ ధ్వంసంపై వైసీపీ అసత్య ప్రచారం

మనుబోలు, ఆగస్టు 12: అమరావతిలోని అంబేద్కర్ విగ్రహాన్ని టీడీపీ వాళ్ళే ధ్వంసం చేశారని వైసీపీ అసత్య ప్రచారాలు చేస్తోందంటూ రాష్ట్ర రైతు కార్యదర్శి రాయపాటి కిరణ్‌కుమార్ మండిపడ్డారు. స్థానిక అంబేద్కర్ విగ్రహం వద్ద సోమవారం టీడీపీ నాయకులు వైసీపీ ఆరోపణలను ఖండించారు. ఈ సందర్భంగా రాయపాటి మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంలో దళితులకు అన్యాయం జరిగిందన్నారు. కావాలనే టీడీపీ ప్రభుత్వంపై వైసీపీ దుష్ప్రచారాలు చేస్తోందన్నారు. అంతకు ముందు అంబేద్కర్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు పచ్చిపాల రామిరెడ్డి, సాని వెంకటరమణయ్య, దండుచంద్రశేఖర్‌రెడ్డి, చింతల వెంకటేశ్వర్లు, కలికి రమేష్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

326 బస్తాల రేషన్ బియ్యం పట్టివేత

బుచ్చిరెడ్డిపాళెం,ఆగస్టు12: రేషన్‌బియ్యంతో వెళ్తున్న ఓ ఆటోను వెంబడించగా స్థానిక పీఎంకే రైస్‌మిల్లులో 326 బస్తాలు పట్టుబడ్డాయని విజిలెన్స్ తహసీల్దారు కృష్ణప్రసాద్ తెలిపారు. ఈమేరకు కేసు నమోదు చేసి ఆటోను బుచ్చి పోలీస్‌స్టేషన్లో అప్పజెప్పినట్టు ఆయన తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

తోకంచి గ్రామ సమీపంలో మైనింగ్ వద్దు

● కలెక్టర్‌కు ఎమ్మార్పీఎస్ నేతల వినతి

పొదలకూరు, ఆగస్టు 12: పొదలకూరు పంచాయతీ పరిధిలోని తోకంచి గ్రామ సమీపంలో మైనింగ్ వద్దంటూ, మైనింగ్ లీజును నిలుపుదల చేయాలని ఎమ్మార్పీఎస్ నాయకుడు పాపయ్య జిల్లా కలెక్టర్ ఆనంద్‌కు సోమవారం గ్రీవెన్స్‌లో వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తోకంచి గ్రామంలో ఎక్కువగా ఎస్సీ, ఎస్టీ, బీసీలు నివసిస్తున్నారని, వీరిలో కొందరు పశువులను, జీవాలను మేపుకుంటూ జీవనం సాగిస్తున్నారని, మైనింగ్ వల్ల ఆ జీవాలకు ప్రాణాపాయం ఉంది కావున మైనింగ్ లీజ్‌ను రద్దు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా జనరల్ సెక్రటరీ చిడదల శ్రీనివాసులు మాదిగ పాల్గొన్నారు.

ఆస్తి పత్రాలు తీసుకెళ్లి... అడిగితే కొడుతున్నాడు !

● వృద్ధ దంపతుల ఆవేదన

బుచ్చిరెడ్డిపాళెం, ఆగస్టు 12: తమ ఆస్తిపత్రాలను కొడుకు మహేష్ దౌర్జన్యంగా తీసుకెళ్లి, అడిగితే దాడి చేస్తున్నాడని మినగల్లు దళితవాడలోని గంటా శివయ్య, మహలక్ష్మమ్మ దంపతులు సోమవారం విలేకరుల సమావేశంలో కన్నీటి పర్యంతమయ్యారు. కనీసం ఇల్లు గడవడం కూడా కష్టతరంతో పాటు పక్షవాతంతో వున్న తండ్రికి మందులకు డబ్బులులేక అడిగితే దాడి చేస్తున్నాడని వాపోయారు. తమకు న్యాయం జరగకుంటే ఆత్మహత్యే శరణ్యమని, విచారించి న్యాయం చేయాలని పోలీసులను కోరుతున్నారు.



గంటా మహలక్ష్మమ్మ, శివయ్యతోపాటు కుమార్తె ఆమె బిడ్డలు

నెల్లూరు సిటీ, రూరల్ కోవూరు, సర్వేపల్లి

వివాహిత బలవన్మరణం

● కుమార్తె మృతిని జీర్ణించుకోలేక అల్లుడిపై మామ కత్తితో దాడి

నెల్లూరు(క్రైం), ఆగస్టు 12: భార్యాభర్తల నడుమ నెలకొన్న విభేదాల నేపథ్యంలో భార్య ఆత్మహత్యకు పాల్పడింది. కుమార్తె మృతిని జీర్ణించుకోలేని మృతురాలి తండ్రి అల్లుడిపై కత్తితో దాడి చేశాడు. పోలీసుల సమాచారం మేరకు.. నగరంలోని బీవీ నగర్‌కు చెందిన షేక్ అబ్దుల్‌హఫీజ్, తెలంగాణ రాష్ట్రం మహబూబ్‌నగర్‌కు చెందిన ఆయేషా కౌసర్(28)లు సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌లు. 2019లో వారు హైదరాబాద్‌లో పనిచేస్తున్న సమయంలో ప్రేమ వివాహం చేసుకున్నారు. వారికి నాలుగేళ్ల పాప ఉంది. వివాహం అనంతరం ఈ దంపతులు బీవీనగర్‌లో స్థిరపడ్డారు. ఇంటి వద్ద నుంచే విధులు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో హఫీజ్ తమ్ముడు కౌసర్ చెల్లెలను వివాహం చేసుకున్నాడు. ఈ నేపథ్యంలో కుటుంబ కలహాల ఏర్పడ్డాయి. దీంతో ఆరు నెలలు కిందట అబ్దుల్‌హఫీజ్, ఆయేషాకౌసర్ దంపతులు రాంజీనగర్ ఏడోవీధిలోని ఓ అపార్ట్‌మెంట్‌లో ప్లాట్ అద్దెకు తీసుకుని అక్కడికి నివాసం వెళ్లారు. ఈ క్రమంలో అనారోగ్యానికి గురైన తన తండ్రికి హఫీజ్ పెద్ద మొత్తం ఖర్చుపెట్టి వైద్యం చేయించారు. ఈ విషయంపై ఆదివారం దంపతుల నడుమ వాగ్వివాదం జరిగింది. దీంతో కౌసర్ మనస్థాపానికి గురై నాల్గో అంతస్థుపై నుంచి కిందకు దూకి ఆత్మహత్యయత్నానికి పాల్పడింది. పెద్దశబ్దం రావడంతో బయటకు పరుగులు తీసిన హఫీజ్ ప్రాణాపాయ స్థితిలో ఉన్న భార్యను చికిత్స నిమిత్తం సమీపంలోని ఓ వైద్యశాలకు తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ ఆమె మృతి చెందింది. ఈ ఘటనపై సమాచారం అందుకున్న బాలాజీనగర్ పోలీసులు కేసు నమోదు చేశారు. కాగా కౌసర్ మృతిపై సమాచారం అందుకున్న ఆమె తల్లిదండ్రులు సోమవారం మెడికవర్ వైద్యశాలకు చేరుకుని కుమార్తె మృతదేహాన్ని చూసిన కన్నీరుమున్నీరయ్యారు. ఆమె కుమార్తెను అల్లుడే చంపేశాడని మృతురాలి తండ్రి ఆలీఖాన్, కుటుంబసభ్యులు ఆరోపించారు. ఆలీఖాన్ కోపంతో రగిలిపోయి తన వెంట తెచ్చుకున్న కత్తితో హఫీజ్‌ను బలంగా పొడిచాడు. గాయాలపాలైన హఫీజ్‌ను నగరంలోని ఓ ప్రైవేటు వైద్యశాలకు తరలించగా అక్కడ చికిత్స పొందుతున్నారు. ప్రభుత్వ వైద్యులు కౌసర్ మృతదేహానికి శవపరీక్ష నిర్వహించి బాధిత కుటుంబసభ్యులకు అప్పగించారు. వివాహిత మృతిపై బాలాజీనగర్ పోలీసులు, హఫీజ్ కత్తితో దాడి చేసిన ఘటనపై నెల్లూరు రూరల్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

యువతకు స్ఫూర్తి ప్రదాత స్వామి వివేకానంద : కలెక్టర్

నెల్లూరు(హరనాథపురం), ఆగస్టు 12 : యువతీ యువకులకు స్ఫూర్తి ప్రదాత స్వామి వివేకానంద అని కలెక్టర్ ఆనంద్ అన్నారు. సోమవారం కలెక్టరేట్ తిక్కన భవన్‌లో అంతర్జాతీయ యువజన దినోత్సవాన్ని పురస్కరించుకొని స్వామి వివేకానంద చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వివేకానంద ప్రబోధాలు నిత్యనూతనమని, అన్ని తరాల వారికి అనుసరణీయమన్నారు. ముఖ్యంగా యువతకు సానుకూల దృక్పథం అవసరమని త్రికరణశుద్ధిగా నమ్మి కృషి చేస్తే సాధించాల్సిన లక్ష్యాన్ని చేరుకోవచ్చుననే వివేకానందుని జీవిత పాఠం అందరికీ ఆదర్శనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి జేసీ సూర్యతేజ, డీఆర్వో లవన్న పాల్గొన్నారు.



స్వామి వివేకానందకు నివాళులర్పిస్తున్న కలెక్టర్

బంగ్లాదేశ్‌లో హిందువులపై దాడులు ఆపాలి

నెల్లూరు (సాంస్కృతికం), ఆగస్టు 12 : మతం పేరుతో అమాయక హిందువులపై జరుగుతున్న దారుణ మారణకాండ ఆపాలని హిందూ సంఘాలు డిమాండ్ చేశాయి. సోమవారం వీఆర్‌సీ హైస్కూల్ మైదానం నుంచి లస్సీ సెంటర్ శివాజీ విగ్రహం వరకు హిందూ సంఘాలు హిందూ ఐక్యత చైతన్య ర్యాలీ నిర్వహించాయి. ఈ కార్యక్రమంలో చైతన్య వేదిక రాష్ట్ర నాయకులు కాకు మురళీరెడ్డి, జిల్లా కన్వీనర్ పీజీ మహేష్, మధురెడ్డి, సొల్లేటి వెంకటేశ్వర్లు, విశ్వ హిందూ పరిషత్, భజరంగ్‌దళ్, సేవికా సమితి, ఏబీవీపీ, శివాజీ, తదితరులు పాల్గొన్నాయి.

దేశభక్తిని ప్రేరేపించడం కోసమే పోటీలు

నెల్లూరు(సాంస్కృతికం), ఆగస్టు 12 : విద్యార్థుల్లో దేశభక్తిని ప్రేరేపించేందుకు ఉపన్యాస, వ్యాసరచన పోటీలు నిర్వహించామని జిల్లా రచయితల సంఘం సభ్యులు ఏ.భారతి, సండడి అరుణ తెలిపారు. సోమవారం బుజబుజనెల్లూరు ప్రభుత్వ పాఠశాలలో స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని విద్యార్థులకు పోటీలు నిర్వహించారు. విద్యార్థులు ఈ పోటీల్లో స్వాతంత్ర్య సమరయోధుల పోరాటాలు, త్యాగాలు చక్కగా తెలిపారని వివరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎస్‌కె.నజ్మా, మణి, తదితరులున్నారు.

మరమ్మతులకు నోచకనే గేట్లు కొట్టుకుపోయాయి

నెల్లూరు,(స్టోన్‌హౌస్‌పేట), ఆగస్టు 12: సాధారణ మరమ్మతులకు నోచుకోని కారణంగానే ఒక్కొక్క డ్యామ్ గేట్లు కొట్టుకు పోతున్నాయని బీజేపీ నమామి గంగే రాష్ట్ర కన్వీనర్ మిడతల రమేష్ పేర్కొన్నారు. సోమవారం నగరంలోని తెలుగుగంగ- సోమశిల కార్యాలయం వద్ద బీజేపీ నాయకులు నిరసన తెలిపారు. అనంతరం తెలుగుగంగ అధికారి నాగేశయ్యకు వినతిపత్రం అందించారు.

సీఎం చంద్రబాబును కలిసిన రూరల్ ఎమ్మెల్యే

నెల్లూరురూరల్, ఆగస్టు 12 : రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుతో నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి సోమవారం వెలగపూడిలోని సచివాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. నెల్లూరురూరల్ నియోజకవర్గానికి సంబంధించి పలు అంశాలపై చర్చించినట్లు సమాచారం. అటు గ్రామాలు, ఇటు మున్సిపాలిటీలోని డివిజన్ల అభివృద్ధికి నిధులు కోసం సీఎంకు విజ్ఞప్తి చేసినట్లు తెలిసింది.



చంద్రబాబుతో ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి

● అభివృద్ధి పనులకు శంకుస్థాపన

రూరల్లోని 41వ డివిజన్ స్కంధ లేఅవుట్‌లో రూ.53 లక్షలతో నిర్మించతలపెట్టిన సీసీరోడ్లు, కల్వర్టులకు ఆయన మాజీ మేయర్ భానుశ్రీతో కలిసి ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపల్ డివిజన్లలో వెనుబడిన ప్రాంతాలను గుర్తించి అక్కడ ప్రజా అవసరాల నిమిత్తం నిధులు ఖర్చు చేస్తున్నట్లు తెలిపారు. సీసీరోడ్లు, కల్వర్టులు, డ్రైన్లు అవసరమైన మేరకు నిధులు వెసులుబాటుని బట్టి కేటాయిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు నాగేశ్వరరావు, లక్ష్మయ్య, రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా కల్పించాలి

నెల్లూరు(సాంస్కృతికం), ఆగస్టు 12 : దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా కల్పించాలని నెల్లూరు కేథలిక్ పీఠాధిపతులు డాక్టర్ ఎండీ ప్రకాశం ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం వీఆర్‌సీ మైదానం నుంచి క్రైస్తవుల శాంతి ర్యాలీని ప్రారంభించారు. వీఆర్ కాలేజీ మైదానం నుంచి ప్రారంభమైన క్రైస్తవుల ర్యాలీ అంబేద్కర్ బొమ్మ, పాత జడ్పీ హాలు మీదుగా కలెక్టర్ కార్యాలయం చేరుకుని జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో దళిత క్రైస్తవ మహాసభ అధ్యక్షుడు ఎలీసా కుమార్, క్రైస్తవ నేతలు వరప్రసాద్, ఏజీ ఇన్నయ్య, ప్రిన్సిపాల్ యేసురాజ్యం, డాక్టర్ ఊరందూరు సురేంద్రబాబు, రాజశేఖర్, డేవిడ్ దయాసాగర్, గడ్డం హనోక్ పాల్గొన్నారు.

నిస్సాన్ ఎక్స్‌ట్రయిల్ కారు విడుదల

నెల్లూరు(సాంస్కృతికం), ఆగస్టు 12 : నగరంలోని మినీబైపాస్ రోడ్డు హైటెక్ నిస్సాన్ షోరూమ్‌లో సోమవారం రాత్రి నిస్సాన్ ఎక్స్‌ట్రయిల్ నూతన కారు మార్కెట్‌లోకి విడుదలైంది. ఎండీ జగన్నాథరెడ్డి మాట్లాడుతూ ఈ కారు అత్యాధునిక ఫ్యూచర్లు కలిగి ఉందని తెలిపారు. వీసీ టర్బోఇంజన్, 360 కెమెరా, ఎలక్ట్రికల్ రూఫ్‌టాప్, 7 ఎయిర్ బ్యాగ్స్, ఆల్‌వీల్ డెక్స్ బ్రేక్ ఉన్నాయన్నారు. ఈ కారు 3 రంగుల్లో లభిస్తుందని తెలిపారు. దీని విలువ రూ.49,92,000 అని తెలిపారు. దీని బుకింగ్ కోసం 90142 11044ను సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్స్ చెరుకు నిరంజన్, సి.భారతి, సి.హోషిమంరెడ్డి, జనరల్ మేనేజర్ ఎస్వీస్ శాస్త్రి, సేల్స్ మేనేజర్ పి.గోపి, ఎస్‌బీఐ చీఫ్ మేనేజర్ బి.లక్ష్మీపతి, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.



నిస్సాన్ ఎక్స్ ట్రయిల్ కారును విడుదల చేస్తున్న షోరూం ప్రతినిధులు

కలెక్టరేట్ ఎదుట ముస్లింల ధర్నా

నెల్లూరు(హరనాథపురం), ఆగస్టు 12 : వక్ఫ్‌బోర్డు చట్ట సవరణ బిల్లును ఉపసంహరించుకోవాలని కోరుతూ ముస్లిం సంఘాల నాయకులు సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా ముస్లిం ఫెడరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షుడు మొహ్మద్ జియాఉల్‌హక్, జేఏసీ నాయకులు ఆసిఫ్‌పాషా మాట్లాడుతూ ఈనెల 8న పార్లమెంటులో వక్ఫ్‌చట్టం సవరణ బిల్లును ప్రవేశపెట్టారన్నారు. అ చట్టంతో ముస్లింలకు ఉన్న అధికారాలను తుడిచివేయాలని కేంద్రం చూస్తోందన్నారు. సామాజిక, ఆర్థిక రంగాల్లో పూర్తిగా వెనుకబాటు తనానికి ముస్లింలను గురిచేయాలన్న దురేద్దేశ్యంతో కేంద్రం ఈ చట్ట సవరణ చేసిందన్న విమర్శలున్న నేపథ్యంలో పార్లమెంటులో మెజర్టీ పార్టీలు ఈ బిల్లును వ్యతిరేకించాయన్నారు. ఈ బిల్లును ఉపసంహరించుకోవాలని, లేక పోతే ఉద్యమాలు చేయాల్సి వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకుడు షానవాజ్, హాజీ మొహ్మద్ అనీఫ్, మౌలానా అబ్దుల్ హఫీజ్, హాజీ సందాని, సయ్యద్ రెహ్మాన్, సయ్యద్ షంషుద్దీన్, తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై స్పందించండి : కమిషనర్

నెల్లూరు(సిటీ), ఆగస్టు 12 : నెల్లూరు నగర వాసులు ఎదుర్కొంటున్న సమస్యలపై కార్పొరేషన్‌లో వినతిపత్రాలు సమర్పించిన వెంటనే స్పందించాలని ఎన్‌ఎంసీ కమిషనర్ మల్లవరపు సూర్యతేజ అధికారులను ఆదేశించారు. సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో భాగంగా తన కార్యాలయంలో ఆయన వినతులు స్వీకరించారు. అనంతరం మాట్లాడుతూ ప్రజల నుంచి సమస్య వచ్చిన వెంటనే అధికారులు క్షేత్ర స్థాయికి వెళ్లి పరిశీలించాలని సూచించారు. ఆ వెంటనే సాధ్యమైనంత త్వరగా పరిష్కరించాలని చెప్పారు. శాశ్వత పరిష్కార మార్గంలోనే వినతుల పరిశీలన్నారు. ఒక్క సారి వచ్చిన అర్జీ మరొకసారి రాకూడదన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్‌ఎంసీ అధికారులు పాల్గొన్నారు.



కమిషనర్‌కు సమస్యలు వివరిస్తున్న ప్రజలు

వృద్ధురాలిపై దాడి చేసి నగదు చోరీ

నెల్లూరు(క్రైం), ఆగస్టు 12: ఓ వ్యక్తి వృద్ధురాలిపై దాడి చేసి నగదు దోచుకెళ్లిన ఘటన బీవీ నగర్‌లో సోమవారం జరిగింది. సేకరించిన సమాచారం మేరకు.. గుర్తుతెలియని వ్యక్తి బైక్‌పై బిరియాని సెంటర్ ఎదురు సందులోకి వచ్చాడు. తాము అమెరికాకు వెళుతున్నామని, తన ఇంట్లోని డబుల్‌కాట్ మంచం, టీవీ, ఫ్రిజ్, వాషింగ్‌మిషన్ ఇలా గృహోపకరణాలన్నింటిని తక్కువ ధరకే విక్రయిస్తామని అక్కడున్న మహిళలతో నమ్మబలికాడు. అతని మాటలు గుడ్డిగా నమ్మిన సుబ్బమ్మ అనే వృద్ధురాలు తనకు కొన్ని వస్తువులు కావాలని చెప్పడంతో రూ.10 వేలు తీసుకుని తన వెంట వస్తే ఇస్తానని చెప్పాడు. దీంతో ఆమె నగదు తీసుకుని అతని బైక్‌లో వెళ్లింది. నిందితుడు అయ్యప్పగుడి సమీపంలోని ఖాళీ స్థలంలోకి తీసుకెళ్లి వృద్ధురాలిపై దాడిచేసి నగదు దోచుకెళ్లాడు. దీంతో బాధితురాలు అక్కడ నుంచి ఇంటికి చేరుకుని జరిగిన ఘటన గురించి కుటుంబసభ్యులకు, స్థానికులకు తెలియజేసింది. అయితే ఇలాంటి ఘటనలే ఈ ప్రాంతంలో తరచూ జరుగుతున్నాయని స్థానికులు పేర్కొంటున్నారు. ఈ ఘటనపై పోలీసులకు ఎలాంటి ఫిర్యాదు అందలేదు.

ఫిట్స్ వచ్చి యువకుడి మృతి

నెల్లూరు(క్రైం), ఆగస్టు 12: మద్యం మత్తులో ఫిట్స్ రావడంతో వ్యక్తి మృతి చెందిన ఘటన సోమవారం జనార్దన్‌రెడ్డి కాలనీ సమీపంలో జరిగింది. పోలీసుల సమాచారం మేరకు.. జనార్దన్‌రెడ్డి కాలనీకి చెందిన సుభాని(31) వెంకటేశ్వరపురంలోని ఓ టీ దుకాణంలో టీ మాస్టర్‌గా పనిచేస్తున్నారు. గత కొంతకాలంగా ఆయన ఫిట్స్‌తో బాధపడుతూ చికిత్స తీసుకుంటున్నారు. ఈ క్రమంలో ఆదివారం తనకు తెలిసిన వారి ఇంట్లో ఫంక్షన్ ఉందని విధులకు సెలవు పెట్టారు. అప్పటి నుంచి మద్యం సేవిస్తూ సోమవారం సైతం పూటుగా మద్యం సేవించారు. ఈ క్రమంలో ఇంటికి వెళుతుండగా కాలనీ కల్వర్ట్ వద్దకు వచ్చేసరికి ఫిట్స్ రావడంతో అక్కడికక్కడే మృతి చెందారు. ఈ ఘటనపై సమాచారం అందుకున్న మృతుడి భార్య, బంధువులు సంఘటనా స్థలానికి చేరుకుని బోరున విలపించారు. మృతుడి భార్య సాబ్‌జాని ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు నవాబుపేట ఇన్‌స్పెక్టర్ షేక్ అన్వర్ బాషా తెలిపారు.

నేటి నుంచి పవిత్రోత్సవాలు

నెల్లూరు(సాంస్కృతికం), ఆగస్టు 12 : నగరంలోని తల్పగిరి రంగనాథస్వామి ఆలయంలో మంగళవారం నుంచి 19వ తేదీ వరకు శ్రీవారి పవిత్రోత్సవాలు జరుగుతాయని ఆలయ ఈవో అర్వభూమి శ్రీనివాసులురెడ్డి, ఛైర్మన్ మంచికంటి శ్రీనివాసులు ఒక ప్రకటనలో తెలిపారు. సాయంత్రం అంకురార్పణ, హోమం, 14వ తేదీ సాయంత్రం పవిత్ర ప్రతిష్ఠ, తిరుమంజనం, ఆదివాసం, పవిత్ర సమర్పణ, నిత్యహోమం, 15న తిరుమంజనం, హోమాలు, పవిత్ర సమర్పణ, గోపురోత్సవం, హోమాలు జరుగుతాయని తెలిపారు. 16, 17, 18వ తేదీల్లో హోమాలు, గోపురోత్సవం, 19న హోమాలు, పూర్ణాహుతి తదుపరి తిరుమంజనం శాత్తుముర్రై, తీర్థ ప్రసాదాలు వినియోగం, మహాకుంభ సంప్రోక్షణలు జరుగుతాయని తెలిపారు. భక్తులందరూ తరలిరావాలని కోరారు.

నేటి నుంచి ఫొటో ప్రదర్శన

నెల్లూరు(హరనాథపురం), ఆగస్టు 12 : భారత ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈనెల 13 నుంచి విభజన గాయాల స్మారక దినోత్సవాన్ని కెనరా బ్యాంకు లీడ్ బ్యాంకు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నామని ఎల్‌డీఎం శ్రీకాంత్ ప్రదీప్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. నగరంలోని డీకేడబ్ల్యూ కళాశాలలో ఈనెల 15 వరకు జరిగే ఈ కార్యక్రమంలో ఫొటో ప్రదర్శన ఉంటుందని పేర్కొన్నారు.

రంగడి ఆలయంలో నిద్రించడం కుదరదు

నెల్లూరు(సాంస్కృతికం), ఆగస్టు 12 : నెల్లూరు మీదుగా పాదయాత్రలు చేసే బృందాలు స్థానిక తల్పగిరి రంగనాథస్వామి ఆలయంలో నిద్ర చేసేందుకు వీలుపడదని ఆలయ ఈవో ఏవీ శ్రీనివాసులు రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. గతంలో రాష్ట్రంలో ఆలయాలలో జరిగిన సంఘటనలు, భద్రత దృష్ట్యా ఆలయంలో నిద్రించుటకు ఇతరులను అనుమతించడంలేదన్నారు. ఆలయం వద్ద నిద్రించాలనుకునేవారు ఆలయం వెలుపల ఉన్న మండపంలో నిద్ర చేయవచ్చునన్నారు. అలాగే కల్యాణ మండపంలో నిద్రించాలనుకుంటే ముందుగా కార్యాలయ పనివేళల్లో ఆధార్ నెంబరు, సెల్‌ఫోన్ నెంబరు, అడ్రసులు ఇచ్చి సంప్రదిస్తే వారికి అవకాశం కల్పిస్తామని తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సౌత్ ఇండియా యోగా పోటీల్లో జిల్లాకు పతకాలు

నెల్లూరు(విద్య), ఆగస్టు 12 : తమిళనాడు యోగా స్పోర్ట్స్ డెవలప్‌మెంట్, కైరలి యోగా విద్యాపీఠం ఆధ్వర్యంలో గుమ్మడిపూడిలో ఆదివారం జరిగిన సౌత్ ఇండియా యోగా పోటీల్లో జిల్లా క్రీడాకారులు ఉత్తమ ప్రతిభ కనబరిచి పతకాలు సాధించారు. 56 ఏళ్ల పైబడిన పురుషుల విభాగంలో రఘురామయ్య ద్వితీయస్థానం, 36-45 ఏళ్ల పురుషుల విభాగంలో శ్రీనివాసులు ప్రథమస్థానం, 17-25 ఏళ్ల మహిళల విభాగంలో లీనా, దివ్యలు తృతీయస్థానం, 13-16 ఏళ్ల బాలుర బ్యాలెన్సింగ్ విభాగంలో సాధన్ ద్వితీయస్థానం సాధించారు. ఇదే ఉత్సాహంతో మున్ముందు మరిన్ని విజయాలు సాధిస్తామని యోగా గురువు ప్రసన్నకుమార్ తెలిపారు.

వైద్యురాలిపై అత్యాచారం, హత్యపై వైద్యుల నిరసన

నెల్లూరు(వైద్యం), ఆగస్టు 12 : పశ్చిమ బెంగాల్ కోల్‌కత్తాలో పీజీ మెడికోపై అత్యాచారం, హత్య చేసిన నిందితునిపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ వైద్య కళాశాల వైద్యులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం రాత్రి వైద్య కళాశాల ప్రిన్సిపాల్‌తో పాటు వైద్యులు క్యాండిల్ చేతబట్టి నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ వసుంధరాదేవి, డాక్టర్ కలేషాసాహెబ్ పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి


ANDHRAJYOTHY

5

తిరుపతి

జిల్లా వార్తలు

మంగళవారం 13 ఆగస్టు 2024



టీడీఆర్ కుంభకోణంపై సీఐడీ విచారణ

రవి నాయుడి ఫిర్యాదుతో కదులుతున్న డొంక

చంద్రబాబుకు నివేదించిన మంత్రి నారాయణ

అవినీతి తీరుపై విస్మయం వ్యక్తం చేసిన సీఎం

తిరుపతి, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ ప్రభుత్వ హయాంలో తిరుపతిలో జరిగిన ట్రాన్స్‌ఫర్‌బుల్ డెవలప్‌మెంట్ రైట్ (టీడీఆర్) బాండ్ల కుంభకోణం తీగ కదలబోతోంది.అమరావతిలోని సీఎం క్యాంప్ కార్యాలయంలో సోమవారం తిరుపతిలో, తణుకులో జరిగిన టీడీఆర్ బాండ్ల కుంభకోణం తీరును పురపాలక శాఖ మంత్రి నారాయణ నివేదించారు. ముఖ్యంగా తిరుపతిలో బాండ్ల జారీకి అనుసరించిన విధానంపై సీఎంతో పాటు అధికార వర్గాలు ఆశ్చర్యం వ్యక్తం చేసినట్టు తెలిసింది. స్థల సేకరణను ఎకరాల్లో గుర్తించి, బాండ్ల జారీకి చదరపు గజాల్లో లెక్కించినట్టు గుర్తించారు. అగ్రికల్చర్, రెసిడెన్షియల్ పరిధిలోని స్థలాలను కూడా కమర్షియల్‌గా గుర్తించి, రిజిస్ట్రేషన్ విలువ పెంచేసి భారీగా లబ్ధి పొందారని అంచనాకు వచ్చినట్టు సమాచారం. రాష్ట్రవ్యాప్తంగా 2019-24లో జారీ చేసిన టీడీఆర్ బాండ్లపై అంతర్గత విచారణతో పాటు, భారీఎత్తున కుంభకోణం జరిగినట్టు వెలుగులోకి వచ్చిన మున్సిపాల్టీలపై సీఐడీ విచారణకు మొగ్గుచూపే అవకాశం కనిపిస్తోంది.

● విజిలెన్స్ విచారణపై హర్షం

తిరుపతి మున్సిపల్ అధికారులపై రాష్ట్ర ప్రభుత్వం విజిలెన్స్ విచారణకు ఆదేశించడం అభినందనీయమని తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవినాయుడు హర్షం వ్యక్తం చేశారు. ప్రజలకు జవాబుదారీగా వ్యవహరించాల్సిన అధికారులు పాలకులకు తొత్తులుగా మారిపోయి ప్రజాధనాన్ని లూటీ చేస్తే తగిన పరిణామాలకు సిద్ధపడాల్సి ఉంటుందన్నారు. మంత్రి నారా లోకేశ్‌కు ప్రజాదర్బార్‌లో ఫిర్యాదు చేసిన వెంటనే స్పందించి మంత్రి నారాయణకు లేఖ రాయడం, ఆయన విజిలెన్స్ విచారణకు ఆదేశించడం హర్షించదగ్గ విషయమన్నారు. అవినీతిపరులైన అధికారులను విడిచిపెట్టేదిలేదని త్వరలోనే మరికొంతమంది అధికారులపై కూడా ఫిర్యాదులు చేయనున్నట్టు చెప్పారు.

వీరిపైనే గురి

వైసీపీ నేతలతో అంటకాగిన తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ అధికారులపై తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవినాయుడు ఇటీవల ప్రజాదర్బార్‌లో మంత్రి నారా లోకేశ్‌కు ఫిర్యాదు చేశారు. ఆయన పురపాలక శాఖ మంత్రి నారాయణకు లేఖ రాయడంతో విజిలెన్స్ విచారణకు ఆదేశించిన విషయం తెలిసిందే. రెవెన్యూ మేనేజర్‌గా ఉన్న వీఎస్ చిట్టిబాబు, ఆర్వో కేఎల్ వర్మపై విజిలెన్స్ విచారణ చేపట్టి, శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని రవి నాయుడు ఫిర్యాదులో పేర్కొన్నారు. కుప్పం మున్సిపల్ కమిషనర్‌గా పనిచేస్తున్న సమయంలో వైసీపీకి చిట్టిబాబు కొమ్ముకాశారని, కుప్పం మున్సిపల్ ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థులను ఇబ్బంది పెట్టడంతో పాటు, ప్రలోభాలకు గురిచేశారని ఫిర్యాదు చేశారు. గత సార్వత్రిక ఎన్నికల్లోనూ వైసీపీ అభ్యర్థి భూమన అభినయ్‌కి ఓట్లు వేయాలని సిబ్బందిపై ఒత్తిడి తెచ్చారని లేఖలో పేర్కొన్నారు. ఇక ఆర్వో కేఎల్ వర్మ పుంగనూరు మున్సిపల్ కమిషనర్‌గా పెద్దిరెడ్డి రామచంద్రా రెడ్డికి అనుకూలంగా వ్యవహరించారని, స్థానిక సంస్థల ఎన్నికల్లో ఆ పార్టీకి అనుకూలంగా పనిచేశారని పేర్కొన్నారు. అదేవిధంగా కుప్పం స్థానిక ఎన్నికల్లో ఎన్నికల అధికారిగా వెళ్లి అక్కడ కూడా పెద్దిరెడ్డి చెప్పినట్టు చేశారని ఆరోపించారు. ప్రస్తుతం కార్పొరేషన్ ఆర్వోగానూ అనేక అక్రమాలకు పాల్పడ్డారని పేర్కొన్నారు. మరో ఫిర్యాదు లేఖలో టౌన్‌ప్లానింగ్ అసిస్టెంట్ సిటీ ప్లానర్ బాలసుబ్రమణ్యం, డీఈ విజయకుమార్‌రెడ్డి పేర్లను ప్రస్తావించారు. మాస్టర్ ప్లాన్ రోడ్ల ఏర్పాటు, టీడీఆర్ బాండ్ల కుంభకోణంలో బాలసుబ్రమణ్యం పాత్ర ఉందని, మాజీ ఎమ్మెల్యే భూమన కరుణాకర రెడ్డికి, మాజీ డిప్యూటీ మేయర్ అభినయ్‌కి అనుకూలంగా వ్యవహరించారని పేర్కొన్నారు.



గురు సరా నందాజీ మహారాజ్

యూపీలో అదృశ్యమైన స్వామీజీ శ్రీకాళహస్తిలో ప్రత్యక్షం

శ్రీకాళహస్తి, ఆగస్టు 12: ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన గురు సరా నందాజీ మహరాజ్ స్వామి శ్రీకాళహస్తిలో ప్రత్యక్షమయ్యాడు. తిరుపతి జిల్లాలో ఆయన కదలికలు ఉన్నాయన్న అనుమానంతో పోలీసు యంత్రాంగం రెండురోజులుగా గాలింపు చేపట్టింది. శ్రీకాళహస్తి పట్టణంలోని శుకబ్రహ్మాశ్రమంలో సోమవారం ఆయన ఉన్నట్లు గుర్తించారు. ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన గురు సరా నందాజీమహరాజ్‌స్వామి కొద్దిరోజుల క్రితం ఆయన ఆవాసం ఉండే ఆశ్రమం నుంచి అదృశ్యమయ్యాడు.అత్యంత ప్రముఖులతో సన్నిహిత సంబంధాలున్న ఆయన కోసం కొద్దిరోజులుగా వెతుకులాట జరిగింది. తిరుపతి జిల్లా పరిధిలో స్వామిజీ కదలికలు ఉన్నట్లు పోలీసుశాఖ అధికారులకు సమాచారం వచ్చింది. రెండురోజుల పాటు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన పలు పోలీసు ప్రత్యేక బృందాలతో పాటు ఆయా పోలీస్‌స్టేషన్ల పరిధిలోని సిబ్బంది గాలించారు. ఎట్టకేలకు శ్రీకాళహస్తి వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో పనిచేసే నరేష్ అనే కానిస్టేబుల్ పట్టణంలోని శుకబ్రహ్మాశ్రమంలో స్వామిజీని గుర్తించి ఉన్నతాధికారులకు సమాచారం అందించారు. తిరుపతి నుంచి ప్రత్యేక బృందం శుకబ్రహ్మాశ్రమానికి చేరుకుని ఆయనను విమానాశ్రయానికి తరలించి అక్కడి నుంచి యూపీకి పంపారు.



రుయా అత్యవసర విభాగంలో చికిత్స పొందుతున్న విద్యార్థులు

బీసీ హాస్టల్లో కలుషిత ఆహారం

14మంది విద్యార్థులకు అస్వస్థత

తిరుపతి(వైద్యం)/రేణిగుంట, ఆగస్టు 12 : రేణిగుంట బీసీ బాలుర వసతిగృహంలో కలుషిత ఆహారం తిని 14మంది విద్యార్థులు అస్వస్థత పాలయ్యారు. ఆదివారం రాత్రి హాస్టల్ భోజనంతో పాటు వెనుక ఓ ఇంట్లో జరిగిన గృహప్రవేశ ఫంక్షన్‌లో చేసిన మిక్చర్, మైసూర్‌పాక్‌ను విద్యార్థులకు అందజేశారు.తిన్న విద్యార్థుల్లో 15మందికి సోమవారం ఉదయం విరేచనాలు, వాంతులు కావడంతో తొలుత రేణిగుంట ప్రభుత్వాస్పత్రికి తరలించారు.అనంతరం తిరుపతి రుయాస్పత్రికి పంపించగా అత్యవసర విభాగంలో చేర్చుకుని వైద్యం అందించారు. అనంతరం చిన్నపిల్లల వార్డుకు తరలించారు.ఒకటి రెండు రోజులు పరిశీలనలో ఉంచి విద్యార్థులు పూర్తిగా కోలుకున్న తరువాత డిశ్చార్జి చేస్తామని చిన్నపిల్లల వైద్య విభాగాధిపతి మనోహర్ తెలిపారు.డీఎంహెచ్‌వో శ్రీహరి రుయాస్పత్రికి చేరుకొని చికిత్స పొందుతున్న విద్యార్థులను పరామర్శించారు. అంతకుముందు జిల్లా బీసీ వెల్ఫేర్ అధికారి చంద్రశేఖర్, సహాయ అధికారి జోత్స్న, డీఎంహెచ్‌వో శ్రీహరి,డీపీవో సుశీలాదేవి రేణిగుంట ప్రభుత్వ ఆస్పత్రికి చేరుకుని విద్యార్థులతో మాట్లాడారు. హాస్టల్లోని గదులు, మరుగుదొడ్లు, పరిసరాలను పరిశీలించారు.డీఎంహెచ్‌వో శ్రీహరి మీడియాతో మాట్లాడుతూ హాస్టల్‌కు వెంటనే పర్మినెంట్ వార్డెన్‌ను నియమించాల్సిన అవసరం ఉందన్నారు.ఎంపీడీవో విష్ణు చిరంజీవి, డాక్టర్ చత్ర ప్రకాష్‌రెడ్డి, ఈవోపీఆర్డీ వెంకటరత్నప్రభ, ఎంఈవో రంగయ్య తదితరులు పాల్గొన్నారు.

భూసమస్యలకు పరిష్కారం దిశగా....

- 16నుంచి రెవెన్యూ సదస్సులు
- జిల్లాలోని 1,107 గ్రామాల్లో నిర్వహణ
- వచ్చే నెల 30 వరకు అర్జీల స్వీకరణ
- జిల్లా నోడల్ అధికారిగా జేసీ
- సదస్సులకు ప్రత్యేక కమిటీ సభ్యులు

తిరుపతి(కలెక్టరేట్), ఆగస్టు 12: తిరుపతి జిల్లాలో భూసమస్యల పరిష్కారానికి ఈ నెల 16నుంచి రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నారు.గత ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ భూములతో పాటు పలువురి భూములను వైసీపీ నేతలు కబ్జా చేయడం, రికార్డులు తారుమారు చేయడం తెలిసిందే. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక బాధితులందరూ ఒక్కొక్కరూ బయటపడుతున్నారు. తమ తమ భూముల సమస్యలపై ఫిర్యాదులందజేస్తున్నారు. ఈ నేపథ్యంలో సమస్య తీవ్రతను గుర్తించిన చంద్రబాబు భూసమస్యల పరిష్కారం కోసం రెవెన్యూ సదస్సులకు శ్రీకారం చుట్టారు. జిల్లాలో ముఖ్యంగా తిరుపతి రూరల్ , చంద్రగిరి, ఆర్‌సీపురం,తిరుపతి అర్బన్ , ఏర్పేడు, రేణిగుంట, తొట్టంబేడు, శ్రీకాళహస్తి మండలాల్లో గత ఐదేళ్లలో ఇలాంటి అక్రమాలు భారీఎత్తున జరిగాయి. బాధితులు పెద్దసంఖ్యలో ఉన్నారు. ఈ భూసమస్యల పరిష్కారానికి గ్రామ రెవెన్యూ సదస్సులు వేదికలు కానున్నాయి. వైసీపీ నేతల భూదందాలు రెవెన్యూ సదస్సుల్లో వెలుగులోకి రానున్నాయి. ఈ నెల 16 నుంచి వచ్చే నెల 30 వరకు ప్రతి గ్రామంలో జరిగే రెవెన్యూ సదస్సుల్లో రైతుల నుంచి ఫిర్యాదులు స్వీకరించనున్నారు. గ్రామస్థాయి సదస్సుల నిర్వహణ పర్యవేక్షణకు జిల్లాలో నోడల్ అధికారిగా .జాయింట్‌కలెక్టర్ శుభం బన్సల్‌ను నియమించారు. భూసమస్యల ఫిర్యాదులను 45రోజుల్లో పరిష్కరించాలన్నది ప్రభుత్వ లక్ష్యం. భూ కొలతల్లో తేడాలు, సర్వే నెంబర్‌లో మార్పులు, సరిహద్దు, భూవిస్తీర్ణంలో తేడాలు, రీసర్వే జరిగిన గ్రామాల్లో రైతులకు ఇచ్చిన రికార్డుల్లో నమోదయిన తప్పులు, భూకబ్జాలు, భూఅక్రమణలు, అసైన్డ్, చుక్కల భూములు తదితర అంశాలపై బాధితుల నుంచి అధికారులు పిటీషన్లు స్వీకరించనున్నారు. అలాగే మ్యుటేషన్, భూవివాదాలు, 22(ఏ)జాబితాలపై ఫిర్యాదులను స్వీకరిస్తారు. ప్రతి ఫిర్యాదునూ రిజిస్టర్‌లో నమోదు చేస్తారు. జిల్లాలోని 774 గ్రామ పంచాయతీల్లోని 1,107 రెవెన్యూ గ్రామాల్లో తహసీల్దారు, ఆర్‌ఐ సమక్షంలో సదస్సులు జరగనున్నాయి. ఇక్కడ సమస్యలను ఆయా రెవెన్యూ డివిజనల్ అధికారులు సమీక్షిస్తారు. అనంతరం పరిశీలన నివేదికలను జిల్లాస్థాయికి పంపుతారు. జిల్లాస్థాయిలో జేసీ, కలెక్టర్ సమీక్షించి పరిష్కార చర్యలు చేపడతారు. వీటి నిర్వహణకు సంబంధిత శాఖల అధికారులతో ప్రత్యేక టీములను నియమించారు.

15న ప్రారంభించనున్న మంత్రి ఆనం

తిరుపతి జిల్లాలో ఈ నెల 15న రాష్ట్ర దేవదాయశాఖమంత్రి ఆనం రామనారాయణరెడ్డి లాంఛనంగా సదస్సులను ప్రారంభించనున్నారు.రెవెన్యూ సదస్సుల నిర్వహణకు ఏడుగురు కమిటీ సభ్యులను కలెక్టర్ వెంకటేశ్వర్ నియమించారు. తహసీల్దారు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్, గ్రామ రెవెన్యూ అధికారి, మండల సర్వేయర్, దేవదాయ ధర్మాదాయశాఖ, వక్ఫ్‌బోర్డు ప్రతినిధులు, రిజిస్ట్రేషన్ శాఖ ప్రతినిదులు, అటవీశాఖ ప్రతినిధి రెవెన్యూ సదస్సు నిర్వహణ బృందాల్లో సభ్యులుగా ఉంటారు.

షార్ వేదికగా నేడు అంతరిక్ష దినోత్సవాలు

● హాజరు కానున్న ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్

సూళ్లూరుపేట, ఆగస్టు 12: ఈనెల 23న జాతీయ అంతరిక్ష దినోత్సవాన్ని పురస్కరించుకొని దేశవ్యాప్తంగా నెల రోజుల పాటు భారత ప్రభుత్వం, ఇస్రో, షార్ సంయుక్త ఆధ్వర్యంలో సంబరాలు నిర్వహిస్తున్నారు. ఇప్పటికే ఆంధ్రప్రదేశ్, పుదుచ్చేరి, తమిళనాడు రాష్ట్రాల్లోని పలు ప్రాంతాల్లో ఈ వేడుకలు ఘనంగా జరిగాయి. మంగళవారం శ్రీహరికోటలోని సతీష్ ధావన్ స్పేస్ సెంటర్‌లోని ఒఆర్ కురుప్ ఆడిటోరియంలో అంతరిక్ష దినోత్సవాలను నిర్వహించేందుకు అధికారులు సర్వం సిద్ధం చేస్తున్నారు. ఈ వేడుకలకు ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ముఖ్య అతిథిగా విచ్చేయనున్నారు. ఉదయం 10నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జరిగే ఈ వేడుకల్లో పాల్గొంటారు.తరువాత షార్‌లోని మిషన్ కంట్రోల్ సెంటర్‌తో పాటు రాకెట్ ప్రయోగ వేదికలను, స్పేస్ మ్యూజియాన్ని పవన్ కల్యాణ్ సందర్శించనున్నారు.

ఎస్ఎస్ఎల్వీ-డీ 3 ప్రయోగం ఒకరోజు వాయిదా

సూళ్లూరుపేట, ఆగస్టు 12 : శ్రీహరికోటలోని అంతరిక్ష ప్రయోగ కేంద్రం షార్ నుంచి ఈవోఎస్-08 ఉపగ్రహ ప్రయోగం ఒక రోజు వాయిదా పడింది.ఈ నెల 16న ఎస్ఎస్ఎల్వీ-డీ 3 రాకెట్ ద్వారా ఈవోఎస్-08 భూ పరిశీలన ఉపగ్రహాన్ని రోదసీలోకి పంపనున్నారు.ఇస్రో అధికారులు తొలుత ఈ ప్రయోగాన్ని ఆగస్టు 15న ప్రయోగించేందుకు ఏర్పాట్లు చేశారు. షార్‌లో ఆగస్టు 13న అంతరిక్ష దినోత్సవాలు, 15న స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఉండడంతో ప్రయోగాన్ని ఒకరోజు వాయిదా వేసినట్లు ఇస్రో వర్గాల సమాచారం. ఆగస్టు 16న ఉదయం 9.17 గంటలకు షార్ నుంచి ఇస్రో రూపొందించిన మూడో స్మాల్ శాటిలైట్ లాంచ్ వెహికల్ ఎస్ఎస్ఎల్వీ-డీ 3 ప్రయోగం చేపట్టనున్నారు. రాకెట్ అనుసంధాన పనులను శాస్త్రవేత్తలు పూర్తి చేసి ప్రయోగానికి సిద్ధం చేశారు. ఉపగ్రహం చుట్టూ ఉష్ణకవచం అమర్చి తుది పరీక్షలను పూర్తిచేశారు. ఇస్రో చైర్మన్ డాక్టర్ ఎస్.సోమనాథ్ మంగళవారం షార్‌లో ప్రయోగంపై శాస్త్రవేత్తలతో సమావేశం కానున్నట్లు తెలిసింది.

ఒక్కడిగా వస్తే రూ.40వేలు

అసోసియేషన్ ద్వారా వస్తే రూ.23వేలే

మెడికల్ ల్యాబ్‌ల అనుమతికి పైసా వసూల్‌కు తెరలేపిన డీఎంహెచ్‌వో కార్యాలయం

రూ 40లక్షల వరకు దోపిడీ?

తిరుపతి, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో నిబంధనలకు విరుద్ధంగా, అనుమతులు లేకుండా ల్యాబులు పెట్టి నాసిరకం వైద్య పరీక్షలు చేస్తూ, ప్రజల రక్తాన్ని పీల్చుతున్న కొన్ని ప్రైవేట్ ల్యాబ్‌ల దందాపై మీడియాలో వచ్చిన వార్తలు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయానికి కాసుల వర్షం కురిపిస్తోంది. 'ప్రైవేట్ ల్యాబుల దందా' శీర్షికన ఇటీవల పత్రికల్లో వచ్చిన కథనాలపై కలెక్టర్ స్పందించారు. చర్యలు తీసుకోవాలని డీఎంహెచ్‌వోను ఆదేశించారు. దీంతో గత వారంలో 26 ల్యాబ్‌లను సీజ్ చేయగా 87 ల్యాబ్‌లకు డీఎంహెచ్‌వో నోటీసులు అందించినట్టు తెలిసింది.తర్వాతే అసలు కథ మొదలైంది. సీజ్‌కు గురైన వారు, నోటీసులు అందుకున్నవారు డీఎంహెచ్‌వో కార్యాలయానికి క్యూ కట్టడం మొదలుపెట్టారు. వారి అవసరాన్ని క్యాష్ చేసుకునేందుకు డీఎంహెచ్‌వో కార్యాలయం పక్కా పథక రచన చేసింది. ల్యాబ్ రిజిస్ట్రేషన్లు చేసేందుకు ప్రత్యేక చొరవ తీసుకుంది. ప్రభుత్వానికి చెల్లించాల్సిన లైసెన్స్ ఫీజు రూ2,500 చెల్లించి, డాక్యుమెంట్లు అందజేస్తే లైసెన్స్ ఇవ్వాల్సిన బాధ్యత డీఎంహెచ్‌వోపై ఉంది. అలా జరగకుండా రిజిస్ట్రేషన్ సమయంలోనే రూ2,500 తోపాటు అదనంగా ఆఫీసు ఖర్చులకోసమని మరో రూ2,500 వసూలు చేసినట్టు బాధితులు ఆరోపిస్తున్నారు. రిజిస్ట్రేషన్ ప్రకియ ముగిసి ఫైల్ సిద్ధమైన తర్వాత అసలు విషయం బయటపెడుతున్నారు. ఒక్కడిగా వస్తే రూ.40 వేలు ఇవ్వాలని, అదే అసోసియేషన్ తరఫున వస్తే రూ.23వేలు సరిపోతుందని డిమాండు చేస్తున్నట్టు బాధితులు చెబుతున్నారు. రూ.23వేలలో 20వేలు ఉన్నతాధికారి పేరు చెబుతుండగా మిగిలిన రూ.3వేలు డీఎంహెచ్‌వోలో అంతా తానై వ్యవహరించే ఓ ఉద్యోగి పేరు బయటకు వస్తోంది. అయినా ఇప్పుడిచ్చేది 3 నెలల తాత్కాలిక లైసెన్స్ మాత్రమేనని, తర్వాత పూర్తిస్థాయి లైసెన్స్ కోసం మరెంత సమర్పించుకోవాల్సి వస్తుందోనని ఆందోళన చెందుతున్నారు. జిల్లావ్యాప్తంగా అధికారికంగా 200 వరకు ల్యాబ్‌లుండగా అనధికారంగా మరో 250 వరకు ఉన్నట్టు తెలుస్తోంది. తిరుపతిలో వందకు పైగా అనధికార ల్యాబ్‌లున్నాయి. వీరంతా ఇప్పుడు అనుమతుల కోసం డీఎంహెచ్‌వో కార్యాలయ బాట పడుతున్నారు. అనేక అవినీతి ఆరోపణలకు కేంద్ర బిందువుగా నిలుస్తున్న డీఎంహెచ్‌వో కార్యాలయం ఈ మధ్యనే ఓ వివాదంలో రచ్చకెక్కింది. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో వైద్య సిబ్బంది నియామకంలోనూ అనేక అవకతవకలు జరిగినట్టు ఆరోపణలున్నాయి. కొత్త ప్రభుత్వం కొలువుదీరి రెండు నెలలు కాక ముందే మరో అవినీతి వ్యవహారం వెలుగులోకి రావడం అందరినీ ఆశ్చర్యపరుస్తోంది. అనధికారికంగా నిర్వహిస్తున్న ల్యాబ్ యజమానులతో సమావేశం నిర్వహించి, వారికి తగిన అవగాహన కల్పించాల్సిన బాధ్యత వైద్యాధికారులపై ఉంది. నిబంధనల మేరకు నడుచుకోవాలని హెచ్చరించి, ఆ మేరకు అనుమతులు మంజూరు చేయాల్సిన అధికారులు వచ్చినవరకు దండుకోవడంపై దృష్టిపెట్టడం విమర్శలకు తావిస్తోంది.

ఉపాధి కూలీలకు వేతనాలొచ్చాయ్

కోట, ఆగస్టు 12 : మూడు నెలలుగా ఎదురుచూస్తున్న ఉపాధి హామీ పథకం కూలీలకు వేతనాలు వచ్చాయి. సోమవారం రాత్రి నుంచే కూలీల బ్యాంక్ ఖాతాల్లో జూన్ 24వ తేదీ వరకు చేసిన పనులకు సంబంధించిన నగదు జమవుతోంది.ఉపాధి కూలీలకు వేతనాలు అందడం లేదంటూ ఇటీవల ఆంధ్రజ్యోతి కథనాన్ని ప్రచురించిన విషయం తెలిసిందే.కోట, వాకాడు, చిట్టమూరు, చిల్లకూరు, గూడూరు, డక్కిలి, బాలాయపల్లి మండలాల్లో పనులు చేసిన కూలీలకు జూన్ 24వ తేదీ వరకు రావాల్సిన వేతనాలను కూలీల బ్యాంక్ ఖాతాలలో జమ చేసినట్లు డ్వామా అసిస్టెంట్ ప్రాజెక్టు డైరెక్టర్ వరప్రసాద్ తెలిపారు.

పనులు కల్పించేలా చర్యలు తీసుకోండి


నిరసన తెలుపుతున్న మైకా కార్మికులు

గూడూరు, ఆగస్టు 12: తమకు పనులు కల్పించి జీవనోపాధి చూపాలని మైకా కార్మికులు డిమాండ్ చేశారు. సోమవారం సబ్‌కలెక్టర్ కార్యాలయం వద్ద మండలంలోని చెన్నూరు కు చెందిన మైకా కార్మికులు నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... గోగినేనిపురం, చెన్నూరు గ్రామాల్లో ఉండే మైకా కంపెనీల్లో పది సంవత్సరాలుగా రోజువారీ కూలీ పనులు చేసుకుని జీవనం సాగిస్తున్నామన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో మైనింగ్‌లో జరిగిన అవకతవకల కారణంగా రెండు నెలలుగా మైన్లను మూసివేశారన్నారు. మైన్ల నుంచి ముడిసరకు వస్తేనే తమకు పనులు ఉంటాయన్నారు. రెండు నెలలుగా పనులు లేకపోవడంతో కుటుంబపోషణ కష్టతరంగా మారిందన్నారు. అధికారులు స్పందించి పనులు కల్పించేలా మైనింగ్ పర్మిట్లు ఇప్పించాలన్నారు. అనంతరం తహసీల్దారు చంద్రశేఖర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో శ్రీనివాసులు, భాస్కర్, కిరణ్, నాగరాజు, వెంకటేశ్వర్లు, మహిళా కూలీలు తదితరులు పాల్గొన్నారు.

ఇసుకను అందుబాటులోకి తేవాలి


వినతిపత్రం అందిస్తున్న సీపీఎం నాయకులు

గూడూరు, ఆగస్టు 12: ఇసుకను అందుబాటులోకి తెచ్చి భవన నిర్మాణ కార్మికులకు పను లు కల్పించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సీపీఎం నాయకులు కోరారు. ఈమేరకు సోమవారం సబ్‌కలెక్టర్ కార్యాలయంలో తహసీల్దారు చంద్రశేఖర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ... ఇసుకను ఉచితంగా అందజేసి, భవన నిర్మాణ కార్మికులకు పనులు కలల్పించాలన్నారు. ఇసుక దళారీ వ్యవస్థను అరికట్టాలన్నారు. గూడూరు నియోజకవర్గంలో ఇసుక స్టాక్ పాయింట్ లేకపోవడంతో అధిక ధరలు వెచ్చించి ఇతర ప్రాంతాల నుంచి తెచ్చుకోవాల్సి వస్తోందన్నారు. సమీప ఏటిలో నుంచి ఇసుకను తెచ్చుకోవాలన్నా పోలీసులు అడ్డుకుంటున్నారని చెప్పారు. నియోజకవర్గ పరిధిలో స్టాక్ పాయింట్లు ఏర్పాటు చేసి ఇసుకను అందుబాటులోకి తీసుకు రావాలని కోరారు. శివకుమార్, బీవీ.రమణయ్య, సురేష్, ప్రసాద్, శంకరయ్య, క్రిష్ణయ్య, తదితరులు పాల్గొన్నారు.

స్వాతంత్ర్యం కోసం ప్రాణ త్యాగం


జెండాను ఆవిష్కరిస్తున్న ఏఐఎస్‌ఎఫ్ నాయకులు

గూడూరు, ఆగస్టు 12: దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణాలు త్యాగం చేసి ఉద్యమం నడిపిన ఏకైక విద్యార్థి సంఘం అఖిల భారత విద్యార్థి ఫెడరేషన్ అని రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శశికుమార్ అన్నారు. సోమవారం ఎస్‌కేఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏఐఎస్‌ఎఫ్ 89వ వ్యవస్థాపక దినోత్సవాన్ని పురస్కరించుకుని పతాకావిష్కరణ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... దేశం కోసం ప్రాణ త్యాగం చేసిన భగత్‌సింగ్ స్ఫూర్తిగా ఏఐఎస్‌ఎఫ్ ఆవిర్భవించిందన్నారు. దేశాన్ని ప్రగతి పథంలో నడిపించేందుకు, విద్యార్థుల సమస్యలను పరిష్కరించేందుకు, మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాలను అరికట్టేందుకు ఏఐఎస్‌ఎఫ్ పోరాటాలు సాగిస్తుందన్నారు. విద్యారంగాన్ని కాపాడుకునేందుకు కలిసికట్టుగా పోరాడుదామన్నారు. ప్రమోద్, ప్రణయ్, సుమంత్, ముకేష్, హారిక తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోండి


ఎమ్మెల్యేకు వినతిపత్రం అందిస్తున్న జనసేన నాయకులు

గూడూరు, ఆగస్టు 12: ప్రజల సమస్యలను సత్వరమే పరిష్కరించేలా చర్యలు తీసుకుంటున్నామని ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ అన్నారు. సోమవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గం లోని పలువురు తమ సమస్యలను పరిష్కరించాలని అర్జీలను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... ప్రజల అర్జీలను సంబంధిత శాఖ అధికారుల దృష్టికి తీసుకువెళ్లి త్వరతగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకున్నామన్నారు. ఈ సందర్భంగా జనసేన నాయకులు కోట మండలంలోని సాగర్ గ్రంధి రొయ్యల కంపెనీ కాలుష్యం కారణంగా ఇబ్బంది పడుతున్నారని, నిబంధనలు పాటించని కంపెనీపై చర్యలు తీసుకుని ప్రజారోగ్యాన్ని కాపాడాలని ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో చంద్రశేఖర్, గురుబాబు, వేణు, రవి నాగార్జున, సాయికిరణ్, సుమన్ తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా పలువురు సమస్యలపై అర్జీలు అందజేశారు.

బీసీలను రాజకీయంగా ఆదరించాలి



తిరుపతి అర్బన్, ఆగస్టు 12: కూటమి గెలుపులో భాగస్వాములైన బీసీలకు ప్రభుత్వంలో రాజకీయంగా ఆదరించాలని ఏపీ బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు నాగరాజ గౌడ్ కోరారు. నామినేటెడ్ పదవుల్లో అవకాశాలు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. కూటమి ప్రభుత్వం కొలువుదీరిన సందర్భంగా గూడూరు నియోజకవర్గం బీసీ సంఘం అధ్యక్షుడు తల్లం ప్రసాద్ ఆధ్వర్యంలో తిరుమలకు పాదయాత్ర చేపట్టారు. సోమవారం ఉదయం అలిపిరికి చేరుకున్న బృందానికి గరుడ సర్కిల్ వద్ద జిల్లా అధ్యక్షుడు స్వాగతం పలికారు. జిల్లా నాయకులు మధు, వెంకటేశ్, శ్రీకాంత్, సయ్యద్‌నౌషద్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధిపై దృష్టి సారించండి

గూడూరు అర్బన్, ఆగస్టు 12: గ్రామాల్లో మౌలిక వసతులు, పారిశుధ్యం మెరుగుపై సర్పంచులు ప్రత్యేక దృష్టి సారించాలని ఏపీఎస్‌ఐఆర్‌డీ పరిశీలకురాలు రాజ్యలక్ష్మి అన్నారు. సోమవారం ఎంపీడీవో కార్యాలయంలో మహాత్మాగాంధీ, అంబేడ్కర్‌కు నివాళి అర్పించి సర్పంచులకు శిక్షణ తరగతులు ప్రారంభించారు. పంచాయతీల అభివృద్ధికి వచ్చే నిధులను సర్పంచులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రధానంగా రోడ్లు, డ్రైనేజీ కాలువలను అభివృద్ధి పరచడం, తాగునీటి సమస్యను పరిష్కరించడం, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. కార్యక్రమంలో డీఎల్‌పీవో వెంకటరమణ, ఎంపీడీవో వెంకటేశ్వరరావు, ఏవో మురళి, ఎంపీపీ గురవయ్య, సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

ప్రారంభానికి సిద్ధంగా అన్న క్యాంటీన్

సూళ్లూరుపేట, ఆగస్టు 12: పేదల ఆకలి తీర్చేందుకు రూ.5కే భోజనం పెట్టేందుకు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తనువాత మళ్లీ అన్న క్యాంటీన్లను పునః ప్రారంభించేందుకు చర్యలు తీసుకున్న విషయం విదితమే. ఈక్రమంలో మున్సిపాలిటీ అధికారులు చకచకా ఏర్పాట్లు చేస్తున్నారు. గాండ్లవీధిలోని సచివాలయం వద్ద అన్నక్యాంటీన్‌కు రంగులు వేసి భవన రూపురేఖలు మార్చి తాగునీరు సహా అన్ని వసతులు సమకూర్చి సిద్ధం చేశారు. ఆగస్టు 15న అన్న క్యాంటీన్‌ను పేదలకు అందుబాటులోకి తేనున్నారు.

బాధ్యతలు స్వీకరించని తహసీల్దార్!

- పేరుకుపోతున్న సమస్యలు
- సర్టిఫికెట్ల కోసం కాళ్లరిగేలా తిరుగుతున్న ప్రజలు



పెళ్లకూరు తహసీల్దార్ కార్యాలయం

పెళ్లకూరు, ఆగస్టు 11: తహసీల్దార్ కార్యాలయంలో 10 రోజులుగా రెగ్యులర్ తహసీల్దార్ లేకపోవడంతో సమస్యలు పేరుకుపోతున్నాయి. భూ సమస్యల పరిష్కారం కోసం రైతులు, కుల, ఆదాయ, నివాస ధృవీకరణ పత్రాల కోసం విద్యార్థులు తహసీల్దార్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు. అయితే తహసీల్దార్ లేకపోవడంతో ఉసూరుమంటూ వెనుదిరుగుతున్నారు. తహసీల్దార్‌గా పనిచేసిన కేవీఆర్వీ ప్రసాదరావు సాధారణ బదిలీల్లో బాలయపల్లికి ట్రాన్స్‌ఫర్ అయ్యారు. నెల్లూరు జిల్లా కలెక్టరేట్ నుంచి పెళ్లకూరు తహసీల్దార్‌గా అనురాధను నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఆమె వ్యక్తిగత కారణాలతో బాధ్యతలు చేపట్టలేదు. దీంతో గత శుక్రవారం నాయుడుపేట తహసీల్దార్ గీతావాణికి పెళ్లకూరు మండల తహసీల్దార్‌గా అదనపు బాధ్యతలు అప్పగించారు. అయితే పెళ్లకూరు తహసీల్దార్ సిమ్‌కార్డుతో పాటు డిజిటల్ కీ ఆమెకు అప్పగించలేదని సమాచారం. ఉన్నతాధికారులు స్పందించి రెగ్యులర్ తహసీల్దార్‌ను నియమించి సమస్యలను త్వరిగతిన పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రధానోపాధ్యాయురాలిపై ఫిర్యాదు

వాకాడు, ఆగస్టు 11 : మండలంలోని కల్లూరు ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం సాయిప్రసూనపై సోమవారం గ్రామస్తులు ఎంఈవో నసీం అలీకి ఫిర్యాదు చేశారు. ప్రాథమిక పాఠశాలలో పది మంది విద్యార్థులుండగా, 18 మందిని చూపుతోందన్నారు. మిగతా 8 మంది ప్రైవేట్ పాఠశాలలో చదువుతున్నా వారికి అటెండెన్స్ వేస్తోంద న్నారు. పాఠశాలలో ఇద్దరు ఉపాధ్యాయులు పని చేసేం దుకు లేని విద్యార్థులను ఆన్‌లైన్‌లోనూ నమోదు చే స్తోందన్నారు. పాఠశాలలో ఇప్పటికే టీసీలు తీసుకుని ప్రైవేటు పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల పేర్లను తొలగించి ప్రధానోపాధ్యాయురాలిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

డిప్యూటీ సీఎం పర్యటనకు పకడ్బందీ ఏర్పాట్లు


ఏర్పాట్లపై అధికారులతో చర్చిస్తున్న ఆర్డీవో - పోలీసులకు దిశానిర్దేశం చేస్తున్న డీఎస్పీ

సూళ్లూరుపేట, ఆగస్టు 12: ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ షార్ పర్యటనను ఎటువంటి లోటుపాట్లు లేకుండా విజయవంతం చేయాలని ఇన్‌చార్జి ఆర్డీవో ఎం.కిరణ్ కుమార్ అన్నారు. సోమవారం ఆయన ఆర్డీవో కార్యాలయంలో డిప్యూటీ సీఎం షార్ పన్యటన నేపథ్యంలో అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... అంతరిక్ష దినోత్సవాలకు శ్రీహరికోటలోని షార్ కేంద్రానికి రానున్న పవన్ కల్యాణ్ పర్యటనను అధికారులందరూ కలిసి విజయవంతం చేయాలన్నారు. అనంతరం రాత్రి షార్‌కు చేరుకొని షార్ డైరెక్టర్ ఆర్ముగం రాజరాజన్‌తో కూడా పర్యటనపై చర్చించారు. సూళ్లూరుపేట తహసీల్దార్ నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

భారీ బందోబస్తు..

డిప్యూటీ సీఎం పర్యటనకు పటిష్ట బందోబస్తు ఏర్పాట్లపై డీఎస్పీ జి.చెంచుబాబు స్థానిక పోలీస్ స్టేషన్‌లో సిబ్బందితో సమీక్షించారు. తిరుపతి విమానాశ్రయం నుంచి డిప్యూటీ సీఎం ప్రత్యేక హెలికాప్టర్‌లో నేరుగా షార్‌కు చేరుకుంటారన్నారు. ఈ సందర్భంగా షార్‌లోని హెలిప్యాడ్ నుంచి పవన్ కల్యాన్ బస చేసే నక్షత్ర అతిథి భవనం వరకు, అదే విధంగా అంతరిక్ష దినోత్సవాలు జరిగే కురుప్ ఆడిటోరియంలో బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. మొత్తం 52 మంది సిబ్బందితో బందోబస్తు ఏర్పాట్లు చేశామన్నారు. వీరిలో డీఎస్పీ, ఇద్దరు సీఐలు, నలుగురు ఎస్‌ఐలు, 45 మంది కానిస్టేబుళ్లు ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో సూళ్లూరుపేట, నాయుడుపేట సీఐలు మురళీకృష్ణ, సంగమేశ్వర రావు, ఎస్‌ఐ రహీం రెడ్డి తదితరులు ఉన్నారు.

గ్రామ పరిపాలనపై సర్పంచులకు శిక్షణ

ఓజిలి, ఆగస్టు 12 : గ్రామ పరిపాలన, పారిశుధ్యం వంటి ప్రధాన అంశాలపై ఓజిలి మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం మండల పరిషత్ విస్తరణాధికారి మోహన్ ఆధ్వర్యంలో సర్పంచులకు శిక్షణ ఇచ్చారు. మండల పరిషత్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో జరిగిన ఈ కార్యక్రమంలో మండలంలోని 26 పంచాయతీల సర్పంచులు, కార్యదర్శులు పాల్గొన్నారు. మూడు రోజులపాటు నిర్వహించనున్న ఈ కార్యక్రమాలలో భాగంగా తొలిరోజు గ్రామ పరిపాలన, పారిశుధ్యంతోపాటు వీధిలైట్ల నిర్వహణ వంటి అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమాలలో భాగంగా రెండో రోజు చెత్తనుంచి సంపద కేంద్రాల క్షేత్ర సందర్శనతోపాటు ఇతర పాలనా అంశాలు ఉంటాయన్నారు. చివరిరోజున ఇతర పరిపాలనా అంశాలపై శిక్షణ ఇవ్వనున్నట్లు ఈవోపీఆర్డీ మోహన్ తెలిపారు.

- బాలాయపల్లి వెలుగు కార్యాలయ సమావేశ భవనంలో సర్పంచులకు విధులు, బాధ్యతలు, పారిశుధ్య నిర్వహణ, చెత్తతో సంపద తయారీ కేంద్రాల నిర్వహణపై ఎంపీడీవో అరుణ అవగాహన కల్పించారు. ఈవోపీఆర్డీ శ్రీనివాసులు, ఏవో వినీల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.
- తడ: సర్పంచులకు మూడు రోజుల శిక్షణ తరగతులు ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో ఎంపీపీ కొలవి రఘురెడ్డి, ఎంపీడీవో విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో ప్రారంభమయ్యాయి. 18 పంచాయతీల సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.
- చిట్టమూరు: మండలంలోని సర్పంచులు, కార్యదర్శలకు సోమవారం శిక్షణ తరగతులు ప్రారంభమయ్యాయి.
- దొరవారిసత్రం: మండల పరిషత్ సమావేశ మందిరంలో 22 పంచాయతీల సర్పంచులకు, పంచాయతీ కార్యదర్శులకు ఎంపీడీవో శివరాజు ఆధ్వర్యంలో శిక్షణ ఇచ్చారు.
- డక్కిలి: పంచాయతీల అభివృద్ధికి సమిష్టి కృషి అవసరమని ఎంపీపీ జి.రాజశేఖర్ అన్నారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సర్పంచుల శిక్షణ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. గ్రామాల్లో మౌలిక వసతులు కల్పించడంపై దృష్టి పెట్టాలన్నారు. రోడ్లు, మురుగునీటి కాలువల నిర్మాణం, కాలువల్లో పూడిక తీత, వీధిలైట్లు వంటి వసతులు కల్పించాలని అందుకు అధికారులు సహకరించాలన్నారు. ప్రాధాన్యతా క్రమంలో నిధులను ఖర్చు చేయాలన్నారు. ఈవోపీఆర్డీ అల్లాబక్ష పాల్గొన్నారు.
- నాయుడుపేట టౌన్: నాయుడుపేట మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ప్రారంభమైన సర్పంచుల శిక్షణ తరగతుల్లో డీఎల్‌పీవో రవీంద్రబాబు, ఎంపీడీవో ప్రేమ్‌రాజ్‌కుమార్, ఈవోపీఆర్డీ భువనేశ్వర్‌శర్మ తదితరులు పాల్గొన్నారు.
- కోట: పంచాయతీల అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేయాలని విజయవాడకు చెందిన డీపీవో, పరిశీలకురాలు రాజ్యలక్ష్మి కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం సర్పంచులు, కార్యదర్శులకు మూడు రోజులపాటు జరిగే శిక్షణ తరగతులు ప్రారంభమయ్యాయి. డీఎల్‌పీవో వెంకటరమణ , ఈవోపీఆర్డీ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

భూములను కాపాడాలంటూ రైతుల విన్నపం


తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసనలో బుదూరువాసులు

దొరవారిసత్రం, ఆగస్టు 12: తప్పుడు డాక్యుమెంట్లతో తమ భూములను స్వాధీనం చేసుకోవాలని చూస్తున్న రియల్టర్ నుంచి కాపా డాలంటూ మండలంలోని బుదూరు గ్రామానికి చెందిన పలువురు రైతులు తహసీల్దారుకు వినతిపత్రం అందించారు. గ్రామానికి చెందిన 30 మంది రైతులు దొరవారిసత్రం తహసీల్దారు కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. అనంతరం తహసీల్దారు శైలాకుమారికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... పక్క గ్రామానికి చెందిన ఓ రియల్టర్ తమకు తెలియకుండానే తమ భూములను దొంగ డాక్యుమెంట్లు సృష్టించి రిజిస్ట్రేషన్ చేసుకున్నాడని వాపోయారు. సుమారు 28 ఎకరాలను పది సంవత్సరాల క్రితం రిజిస్ట్రేషన్లు చేసుకున్నట్లు చెబుతున్నాడని, ఇప్పుడు వచ్చి దున్నడానికి యత్నిస్తున్నాడని పేర్కొన్నారు. దీంతో తహసీల్దార్ చర్యలు తీసుకుంటామని బాధితులకు చెప్పారు. సమస్య పరిష్కారమయ్యే వరకు ఆ భూముల్లోకి ఎవ్వరూ ప్రవేశించకూడదని ఆదేశాలిచ్చారు. సదరు రియల్టర్ నుంచి వివరాలు తీసుకుని, గ్రామసభ నిర్వహిస్తామన్నారు. చట్టపరంగా న్యాయం చేస్తామని తహసీల్దార్ చెప్పారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

నాయుడుపేట టౌన్, ఆగస్టు 12: నాయుడుపేట సబ్ స్టేషన్‌లోని బ్రేకర్ల అత్యవసర మరమ్మతుల నేపథ్యంలో ఈనెల 12న మంగళవారం ఉదయం 9 నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని ట్రాన్స్‌కో అధికారలు చెప్పారు.

వైభవంగా హేమాలమ్మ గ్రామోత్సవం



తడ, ఆగస్టు 12: మండలంలోని చేనిగుంట గ్రామదేవత హేమాలమ్మ అమ్మవారి గ్రామోత్సవం ఆదివారం అర్ధరాత్రి నుంచి సోమవారం ఉదయం వరకు వైభవంగా జరిగింది. ఆదివారం అమ్మణ్ణికి ప్రత్యేకాభిషేకాలు నిర్వహించారు. రాత్రి అమ్మవారి ఉత్సవ విగ్రహానికి ప్రత్యేక పూలంకరణ చేసి గ్రామోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది.

ఆటోను ఢీ కొన్న ఆర్టీసీ బస్సు: ఇద్దరికి గాయాలు


నుజ్జునుజ్జైన ఆటో

నాయుడుపేట టౌన్, ఆగస్టు 12: నాయుడుపేట - పండ్లూరు జాతీయ రహదారి సమీపంలో ఆర్టీసీ బస్సు ఆటోను ఢీ కొంది. ఈ ఘటనలో ఇద్దరికి గాయాలయ్యాయి. పెళ్లకూరు మండలం చిల్లకూరుకు చెందిన సుబ్రహ్మణ్యంరెడ్డి, నవీన్... ఓజిలిలో సోమవారం సిమెంట్ ఇటుకలను కొనుగోలు చేసి ఆటోలో పెట్టుకొని గ్రామానికి బయలుదేరారు. మార్గమధ్యంలో పండ్లూరు సమీపంలో నెల్లూరు నుంచి తిరుపతికి వెళ్తున్న ఆర్టీసీ బస్సు వెనుక నుంచి ఆటోను ఢీ కొనింది. ఈ ప్రమా దంలో సుబ్రహ్మణ్యంరెడ్డి, నవీన్ గాయపడ్డారు. సమాచారం అందుకున్న హైవే అంబులెన్స్ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను నాయుడుపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

అన్నదానం

గూడూరు అర్బన్, ఆగస్టు 12: పట్టణంలోని గమళ్లపాళెంలో ఉన్న నిరాశ్రయుల కేంద్రంలో సోమవారం శ్రీకృష్ణ సేవా సమితి ఆధ్వర్యంలో వృద్ధులకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా సమితి అధ్యక్షుడు మయూరి శ్యామ్‌యాదవ్ మాట్లాడుతూ... తమ సంస్థ ఆధ్వర్యంలో ప్రతి నెలా ఈ సేవా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో మహేశ్వరి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఉచ్చూరు... రొచ్చు...రొచ్చు!



దొరవారిసత్రం, ఆగస్టు 12: మండలంలోని ఉచ్చూరు గ్రామంలో ప్రధాన రోడ్డు రొచ్చురొచ్చుగా మారింది. గ్రామ నడిబొడ్డున ఉన్న రోడ్డు భారీ గోతులతో పాటు, వర్షపు నీరు చేరడంతో రాకపోకలకు ఇబ్బందిగా మారింది. రోడ్డులోని నీరు వెలుపలికి వెళ్లే దారి లేకపోవడంతో పరిస్థితి దారుణంగా మారింది. గ్రామానికి ప్రధాన దారి కావడంతో అందరూ ఈ రోడ్డు మీదుగా రాకపోకలు సాగిస్తుంటారు. సుమారు 400 కుటుంబాలు నివసించే గ్రామం కావడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో రోడ్లకు మరమ్మతులు చేపట్టకపోవడంతో ఈ పరి స్థితి దాపురించింది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు రోడ్డుపై బురద నిల్వ లేకుండా చర్యలు తీసుకోవాలని ఉచ్చూరువాసులు కోరుతున్నారు.

ఎస్వీ అన్నప్రసాదం ట్రస్టుకు రూ.51.09 లక్షల విరాళం



తిరుమల, ఆగస్టు12(ఆంధ్రజ్యోతి): టీటీడీ నిర్వహణలోని ఎస్వీ అన్నప్రసాదం ట్రస్టుకు సోమవారం రూ.51.09 లక్షలు విరాళంగా అందాయి. హైదరాబాద్‌లోని పునర్నవ్ ఆయుర్వేద కంపెనీకి చెందిన బొమ్మ వెంకటేశ్వర‌రెడ్డి ఈ విరాళపు మొత్తాన్ని చెక్ రూపంలో తిరుమలలో టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరికి అందజేశారు.

చోరీ కేసులో బాలుడికి ఏడాది జైలు

తిరుపతి(నేరవిభాగం), ఆగస్టు 12: దొంగతనం కేసులో 17యేళ్ల బాలుడికి ఏడాది సాధారణ జైలు శిక్ష విధిస్తూ జువైనల్ జస్టిస్ బోర్డు తీర్పు చెప్పింది.చిత్తూరుకు చెందిన ఓ బాలుడు గత ఏడాది తిరుపతి రూరల్ స్టేషన్ పరిధిలోని ఓ ఇంటిలో దొంగతనం చేసి దొరికిపోయాడు.కేసు నమోదు చేసిన రూరల్ పోలీసులు కోర్టులో హాజరు పరిచారు. దాదాపు ఏడాదిపాటు సాగిన ఈ కేసులో దోషికి సంవత్సరం పాటు సాధారణ జైలు విధిస్తూ తీర్పు చెప్పారు.

మొక్కు చెల్లించుకునేందుకు కూటమి నేతల తిరుమల పాదయాత్ర



వెంకటగిరి, ఆగస్టు 12: కూటమి ప్రభుత్వం ఏర్పడి ముఖ్యమంత్రిగా చంద్రబాబు, వెంకటగిరి ఎమ్మెల్యేగా కురుగొండ్ల రామకృష్ణ విజయం సాధిస్తే కాలినడకన తిరుమలకు వస్తామని ఎన్నికలకు ముందు మొక్కుకున్నామని దాన్ని చెల్లించేందుకు బయలు దేరామని డక్కిలి మండలం, వెంకటగిరి రూరల్ టీడీపీ అధ్యక్షులు పి.కోటేశ్వరరెడ్డి, పి.చంద్రమౌళిరెడ్డి చెప్పారు. వెంకటగిరి క్రాస్‌రోడ్డు సెంటర్ వద్ద ప్రారంభమైన యాత్రను తెలుగుయువత రాష్ట్ర ఉపాధ్యక్షుడు కేవీకే ప్రసాద్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా టీడీపీ నేతలు మాట్లాడుతూ... రాష్ట్రంలో రాక్షస పాలన పోయి రామరాజ్యం రావాలని ఎన్నికలకు ముందు ఆ దేవదేవుడిని వేడుకున్నట్లు చెప్పారు. కలియుగ దైవం వేంకటేశ్వర స్వామి కరుణాకటాక్షం వల్ల కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందన్నారు.

భూ సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు

బాలాయపల్లి, ఆగస్టు 12: భూ సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ కెవిఆర్‌వి ప్రసాద రావు తెలిపారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్వోలతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఈనెల 16 నుంచి 45 రోజులు పాటు అన్ని పంచాయతీల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించి వినతులు స్వీకరిస్తామన్నారు. డీటీ టి.శిరీష, ఆర్‌ఐ పూర్ణచంద్ర తదితరులు పాల్గొన్నారు.

శ్మశాన స్థలాన్ని చూపండి

శ్మశాన స్థలాన్ని చూపాలంటూ మండలంలోని కడగుంటకు చెందిన గిరిజనులు సోమవారం తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. తమ కాలనీ లో ఎవరైనా మృతి చెందితే మృతదేహాలను పూడ్చేందుకు స్థలం లేక ఇబ్బంది పడుతున్నామన్నారు. గతంలో ఉన్న శ్మశానాన్ని కొందరు ఆక్రమించడంతో ఈ పరిస్థితి తలెత్తిందన్నారు.

క్యాన్సర్ నిర్ధారణ వైద్య శిబిరం


చంద్రశేఖరపురంలో జరిగిన శిబిరం

కోట, ఆగస్టు 12: మండలంలోని గూడలి, చంద్రశేఖర పురంలలో సోమ వారం వీపీఆర్ ఫౌండేషన్, బాలాజీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ అంకాలజీ, శ్రీ వెంకటేశ్వర వైద్య విజ్ఞాన సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత క్యా న్సర్ నిర్ధారణ శిబిరం జరిగింది. శిబిరాన్ని సర్పంచు ఆదెమ్మ, ఉప సర్పంచ్ విజయసారధిరెడ్డి ప్రారంభించారు. తిరుపతిలోని స్విమ్స్ వైద్యశాలకు చెందిన పలువురు వైద్యులు ఆయా శిబిరాల్లో గ్రామస్తులకు క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. డాక్టర్ దుర్గా సౌజన్య, డాక్టర్ రామాంజనేయులు ఆధ్వర్యంలో రక్తం నమూనాలను సేకరించి తిరుపతికి తీసుకువెళ్లారు. ఈ సందర్భంగా మందులు పంపిణీ చేశారు. స్థానిక గునపాటిపాళెం వైద్య సిబ్బంది, ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు శిబిరాల్లో సాయం చేశారు.

సమస్యల పరిష్కారానికి కృషి

వెంకటగిరి టౌన్, ఆగస్టు 12: సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని కౌన్సిలర్ శంకరయ్య చెప్పారు. సోమవారం 8వ సచివాలయంలో అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... 14వ వార్డులోని బొగ్గులమిట్ట, ధర్మాపురం, నరసింహారావు వీధిలో పారిశుధ్యం సరిగాలేదన్నారు. కాలువల్లో మురుగు కదలడం లేదన్నారు. వార్డులో మున్సిపాలిటీ అధికారులు ఫాగింగ్ చేపట్ట లేదన్నారు. ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ దృష్టికి తీసుకెళ్లి సమస్యలను పరిష్కరిస్తానన్నారు.

బదిలీపై వెళ్తున్న ఎంపీడీవోకి సన్మానం

నాయుడుపేట టౌన్, ఆగస్టు 12: బదిలీపై వెళ్తున్న ఎంపీడీవో ప్రేమ్‌రాజ్‌కుమార్‌ను సిబ్బంది సన్మానించారు. ఎన్నికల సమయంలో నాయుడుపేట ఎంపీడీవోగా పనిచేసిన ప్రేమ్‌రాజ్‌కుమార్ బదిలీపై చిత్తూరు జిల్లా వెదురుకుప్పానికి వెళ్లడంతో సోమవారం సాయంత్రం కార్యాలయంలో ఆయన్ను సహచర ఉద్యోగులు సన్మానించారు.

చిట్టమూరు: గడిచిన ఐదు నెలల విధి నిర్వహణలో సహకరించిన అన్ని శాఖల అధికారులకు ధన్యవాదాలు తెలుపుతున్నట్టు బదిలీపై వెళ్లిన ఎంపీడీవో నాగరాజు పేర్కొన్నారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఎంపీడీవో సాలెడ్‌కు ఆయన బాధ్యతలను అప్పగించారు. అనంతరం సిబ్బంది నాగరాజును సన్మానించారు. ఈవోపీఆర్డీ మనోహర్ గౌడ్, పంచాయతీ కార్యదర్శులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులను సర్దుబాటు చేయండి

- ఫ్యాప్టో నేతల డిమాండ్

నాయుడుపేట, ఆగస్టు 12: పాఠశాలల్లో ఉపాధ్యాయుల సర్దుబాటును జీవో 53 ప్రకారం నిర్వహించాలని ఫ్యాప్టో నేతలు డిమాండ్ చేశారు. గూడూరు డిప్యూటీ డీఈవో ఎం.శాంతిని నాయుడుపేట విద్యావనరుల కేంద్రంలో సోమవారం కలసి వినతిపత్రం అందజేశారు. 2020లో విడుదల చేసిన జీవో 53 ప్రకారం పని సర్దుబాటు ప్రక్రియలో సీనియర్లకు విల్లింగ్ అవకాశం ఇవ్వాలని కోరారు. మండల, డివిజన్ స్థాయిలోనే సర్దుబాటు ఉండేలా చర్యలు తీసుకోవాలని, ఆయా మేనేజ్‌మెంట్లలో భర్తీ చేసిన తరువాతే ఇతర మేనేజ్‌మెంట్లను నింపాలని కోరారు. అలాగే ప్రాధాన్యతా కేటగిరిల్లో బదిలీ అయిన ఉపాధ్యాయులను పని సర్దుబాటు నుంచి మినహాయించాలని కోరారు. విద్యార్థుల సంఖ్య ఆధారంగా సర్దుబాటు చేస్తే ఎలాంటి ఇబ్బందులు ఉండవని కోరారు. ఎంఈవో మునిరత్నం, గోవర్ధన్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, రామకృష్ణ, వెంకటరావు, ఏవీ సురేష్, అల్లెయ్య, చంద్రయ్య, కిరణ్‌కుమార్ తదితరులు వినతిపత్రం ఇచ్చిన వారిలో ఉన్నారు.

పురందేశ్వరిని కలిసిన పురుషోత్తమరెడ్డి



వాకాడు, ఆగస్టు 11: బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు, ఎంపీ దగ్గుపాటి పురందేశ్వరిని గూడూరు నియోజకవర్గ బీజేపీ కన్వీనర్ పాపారెడ్డి పురుషోత్తమరెడ్డి అమరావతిలో మర్యాదపూర్వకంగా కలిశారు. గూడూరు నియోజక వర్గంలోని వాకాడు మండలం గంగన్న పాళెం వద్ద స్వర్ణముఖినదిపై వంతెన నిర్మాణం, తిరుమూరులో తెగిన రోడ్డు నిర్మాణం జరిగేలా కృషి చేయాలని కోరినట్టు పురుషోత్తమరెడ్డి చెప్పారు.

ప్రజా ప్రతినిధులను పట్టించుకోండి

వాకాడు, ఆగస్టు 11 : మండలంలో జరిగే పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రజా ప్రతినిధుల ద్వారా చేపట్టాలని తహసీల్దారు రామయ్య, ఎంపీడీవో వెంకటేశ్వరరావుకు సోమవారం వాలమేడు గ్రామస్తులతో కలసి జడ్పీటీసీ సభ్యుడు ఆర్ రామకృష్ణ వినతిపత్రం అందజేశారు. గ్రామంలో ఉపాధి హామీ పనులు సక్రమంగా జరిగేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు ఎంపీటీసీ సభ్యులు, సర్పంచుల పాల్గొన్నారు.